Barcode : 2020050002625
Title - maanavaseiva, sanputamu Iii, sanchika 1, may 1913
Author - -
Language - Telugu
Pages - 62
Publication Year - 1913
Barcode EAN.UCC-13

1583

క్రొత్త పద్ధతిని అనుసరించి చేయబడినది.

# *KAMINIA OIL*

## కామినియా ఆయిల్ (రిజిష్టర్డు.)



స్త్రీలకు తమ వెంట్రుకలు, సుందరముగా నుండవలె కొనవలెనని, ఆరోగ్యముగా నుండవలెనని, బజారులో దొరికెడు నూనెలను వాడుచున్నారు. దానియందున్న వెంట్రుకలు యే కారణముచేత ఆరోగ్యముగా నున్నవో తెలియని మాదిరి తయారు చేయుచున్నారు. ఈ సంగతి స్త్రీలు ఆలోచించవలెయును, ఈ కామినియా నూనె మూలికలనుండి సాంకేతిక శోధన ప్రకారము తయారు చేయబడియున్నది. ఈ నూనె వెంట్రుకలను రాలు పురుగులను నశింపజేయుచుండెదె దానివలన వెంట్రుకల రాలక తిరిగి పెరుగుచున్నవి. ఈ నూనె వెంట్రుకలను పట్టువలె నున్నగ చేసి మృదువును పల్లగా నుంచుచున్నది. ఈ నూనె శిరోవ్యాధులకు ఒక పరిమాణమాయున్నది. స

ర్వోత్తమ ద శ్యక

ప్రదర్శన

యందు బంగారుపతకమున్న అలహాబాదు ప్రదర్శనియందు మంచి సర్టిఫికెట్టున్న పొం దియున్నది. ఇది దేశమంతయు వ్యాపించియుండుటచేత దీనిగుణమును మేము చెప్పనక్కరలే లేదు. అనేకగౌరవ్యులు సర్టిఫికెట్లొసంగియున్నారు.

తాజాకిలము. అనుభవముకొరకు గాను ఒకసారికి సరిపడెడు నూనెను మాదిరికిగ నుచితముగ నిచ్చెదము. బయట యూరివాళ్ళు అర్ధణాపోష్టుస్టాంపు పంపించినయెడల మాదిరి పంపుచున్నాము.

వెల సీసా 1కి రూ 1-0-0 మూడు సీసాలకు రూ 2-10-0 ట. ఖ. ఖర్చులు వేరు.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ.

డ్రగ్గిస్టు అండ్ కెమిస్టు, జుమ్మామస్జిద్, బొంబాయి

కీర్తిశేషులైన శ్రీ కంచుల శ్రీమన్నారాయణగారిచే స్థాపింపఁబడియె.

సంపుటము. III || మే నెల 1913. || సంచిక.

# మానవసేవ.

మత సంఘ పరిశ్రమ భాషాది విషయములఁ జర్చించు

## సచిత్ర మాసపత్రిక

రాజమహేంద్రవరము

పత్రికాసంపాదకులు

నాళము కృష్ణారావు

సత్యవోలు అప్పారావు.

సత్యవోలు అప్పారావుచే

శ్రీవిద్యానిలయ ముద్రాశాలయందు

ముద్రింపించి ప్రకటింపఁబడియె.


రాజమహేంద్రవరము.

1913.

# విషయములు

స్వవిషయము


1. భక్తసంజీవని (భాగవతము) — నాళము కృష్ణారావుగారు.
2. ఆర్యసూక్తిముక్తావళి — సత్యవోలు అప్పారావుగారు.
3. చాణక్యశతకము — కపిరాజు శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు
4. దుర్గావతి (నవల) — గోటేటి జగన్నాథరావుగారు.
5. ధర్మపుత్రుడు (నీతికథ) — కామరాజు హనుమంతరావుగారు.
6. సంఘసంస్కరణము — ఎమ్. వేంకటరంగయ్యగారు ఎమ్. ఏ.
7. బ్రాహ్మమతము — పాలపర్తి నరసింహముగారు.



గంధమాదనపర్వతము.

# రా జ పో ష కు లు

1. శ్రీరాజా రావువేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు.
2. శ్రీరాజా నాయని వేంకటరంగారావుబహద్దరువారు. మునగాల.

# పో ష కు లు

1. శ్రీయుత శ్రీకొవ్వూరి చంద్రారెడ్డిగారు. జమీందారు, పిఠాపురం.
2. ,, శ్రీకలిదిండి వేంకటరామరాజుగారు ,, ,,
3. ,, తమ్మన మాణిక్యముగారు ఏలూరు.
4. ,, శ్రీమోతే గంగరాజుగారు. జమీందారు. ఏలూరు.
5. శ్రీరాజా కాకర్లపల్లి అచ్యుతరామయ్య బహద్దరువారు. యాదవోలు.
6. ,, కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరువారు. గంపలగూడెం

# అ భి మా ను లు

1. శ్రీయుత అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు. ఏలూరు.
2. ,, శ్రీఉయ్యూరు మైసరు జమీందారుగారు. చెన్నపురి.
3. ,, చుండూరు శ్రీరాములుగారు. ఏలూరు.
4. శ్రీరాజా వెలుగోటి ముద్దుకృష్ణయాచేంద్ర బహద్దరువారు. వేంకటగిరి.
5. శ్రీయుత డి. పానకాలరావుగారు. కోయంబత్తూరు.
6. ,, రావుబహద్దరు రఘుపతి వేంకటరత్నముగారు. , కాకినాడ.
7. శ్రీరాజా బులుసు సర్వారాయుడు బహద్దరుగారు. కపిలేశ్వరపురము

# చందా వివరము

| | |
|---|---|
| చందాదారులకు | వత్సరమునకు |
| అభిమానులకు | ,, |
| పోషకులకు | ,, |

రాజపోషకుల చందాప్రమాణము వారి యనుగ్రహాధీనము.

మాదిరిపత్రిక కావలయువారు 4 అణాల పోస్టు స్టాంపులు బంపవలయును!

# ప్రకటన పద్ధతి

| | పుటకు. | | అరపుటకు |
|---|---|---|---|
| వత్సరమునకు | రు 30 | ... ... | రు 18 |
| అర్ధవత్సరమునకు | 18 | ... ... | 10 |
| మూడుమాసములకు | 10 | ... ... | 6 |
| మాసమునకు | 3—8 | ... ... | 2—8 |

# మానవసేవ.

మత సంఘ పరిశ్రమ భాషావిషయములఁ జర్చించు

సచిత్ర మాసపత్రిక

రాజమహేంద్రవరము.

పత్రికాసంపాదకులు—నాళము కృష్ణారావు, సత్యవోలు అప్పారావు.

ప్రతిమాసమును మొదటితేదినాఁటికి వెలువడుచుండును.

మూఁడవసంపుటము మేనెలనుండి ప్రారంభింపఁబడును.

ఇందు దేశచరిత్రములు, నాటకములు, నవలలు, నీతికథలు, పద్యకావ్యములు, గ్రంథవిమర్శనములు, నీతిమతసాంఘికోపన్యాసములు, దేశవీరులయొక్కయు భక్తులయొక్కయు చారిత్రములు, ప్రకృతిశాస్త్రాదిగ్రంథములు, మున్నగునవి ప్రచురింపఁబడుచుండును.

## విలేఖకులు.

| | | | |
|---|---|---|---|
| శ్రీచెన్నాప్రగడ భానుమూర్తి బి.ఏ. | గారు | శ్రీతామూరి లక్ష్మీనరసింహారావు | గారు |
| శ్రీగోటేటి కనకరాజు బి. ఏ. | ,, | శ్రీఉమ్రే అలీషా | ,, |
| శ్రీదుగ్గిరాల సూర్యప్రకాశరావు బి.ఏ. | ,, | శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ | ,, |
| శ్రీమానవల్లి రామకృష్ణకవి ఎం. ఏ. | ,, | శ్రీసూరాబత్తుల సూర్యనారాయణ | ,, |
| శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావు ఎం.ఏ. | ,, | శ్రీపాలపర్తి నరసింహము | ,, |
| శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహము | ,, | శ్రీనిడదవోలు వేంకటరావు | ,, |
| శ్రీకవిరాజ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి | ,, | శ్రీనాగంటి శేషయ్య | ,, |
| శ్రీవడ్డాది సుబ్బారాయుడు | ,, | శ్రీఅయ్యంకి వేంకటరమణయ్య | ,, |
| శ్రీచిలుకూరి వీరభద్రరావు | ,, | శ్రీముట్నూరి సుబ్బారాయుడు | ,, |
| శ్రీమంగిపూడి వేంకటశర్మ | ,, | శ్రీపులవర్తి వేంకటసుబ్బారావు | ,, |
| శ్రీతల్లాప్రగడ సూర్యనారాయణ | ,, | శ్రీకవుకొండల వేంకటరావు | ,, |
| శ్రీఆకెపూడి సోమనాథరావు | ,, | శ్రీపండిత పెండ్యాల సుబ్రహ్మణ్యము | ,, |
| శ్రీఅత్తిలి సూర్యనారాయణ | ,, | శ్రీ ఇ. సుబ్బాకృష్ణయ్య | ,, |

# మానవసేవ.

మ. గరిమన్ స్వర్ణ మనేకభూషణము లై కన్పట్టుచందంబునన్
బరమాత్ముం డఖిలప్రపంచమయుఁడై భాసిల్లుఁ గానన్ జరా
చరరూపోజ్జ్వలసర్వభూతములకున్ సంప్రీతి గావించుచున్
నిరతిన్ మానవసేవ సర్వజనముల్ నిత్యంబు సేయం దగున్.

భూమండలమున మనభరతఖండముతక్క తక్కిన దేశము లెల్ల నిక్కాలమున నాగరికాగ్రగణ్యము లై సమస్తసౌఖ్యములతోఁ దులదూగుచు భూలోకస్వర్గములో యన భాసిల్లుచున్నవి. నిన్నమొన్నటివఱకును గన్నుల దెఱవనివిదేశీయులు తమగాఢనిద్రనుండి మేల్కాంచి యొక్కపెట్టున మహోన్నతదశ నందుచున్నారు.

అనేకశతాబ్దములకుఁ బూర్వమే లోకపూజ్యు లగు మహర్షులచేతను, జగద్విఖ్యాతయశులగు చక్రవర్తులచేతను, దేశభక్తులగుప్రజలచేతను ప్రకాశించుచు సకలలోకగురుపీఠము నధిష్ఠించిన మనభరతవర్షము నేఁడు కళాహీనమై యధఃపతితమగుచున్నది.

'ఏకమేవాద్వితీయంబ్రహ్మ' యని బోధించినమన మిప్పుడు బహుదేవతారాధనము జేయుచున్నారము. 'బ్రహ్మకృపాహి కేవలమ్' అని యుపదేశించినమనము విగ్రహముల నుపాసించుచున్నారము. 'ఆత్మవత్సర్వభూతాని' యని చెప్పినమనము శాఖాభేదములకై పెనఁగులాడుచున్నారము. 'నమాతుఃపరదైవతమ్' అని శాసించినమనము మాతృపూజను మఱచినారము. 'విద్యావిహీనఃపశుః' అని తెలిపినమనము విద్యలను విడనాడినారము.

అశేషశేముషీధురంధరు లగు దేశబంధు లహోరాత్రములు శ్రమపడి సముపార్జించిన జ్యోతిశ్శాస్త్రము గగనకుసుమ మైనది. వైద్యశాస్త్రములు మందున కైనఁ గానరాకున్నవి. శిల్పములు స్వల్పము లైనవి. చేతిపనులు చేజారిపోయినవి.

అజ్ఞానవ్యాధిగ్రస్త మై ప్రాణమాత్రావశిష్ట మై యున్న మనదేశదేహమును సముచితోపాయసిద్ధౌషధసేవనంబున నారోగ్యభాగ్యయుక్తముగ జేయక కతిపయకాల ముపేక్షించితిమేని నపాయము సంభవించును. కావున మనయార్యసన్మతమును సముద్ధరింపవలయును. మనయాచారముల సంస్కరించుకొనవలయును. సారస్వతము నుజ్జీవింపఁజేయవలయును. ప్రకృతిశాస్త్రముల బలపరచుకొనవలయును.

ఇవ్విధమున మానవసేవ సేయవలయు నని యీ 'మానవసేవను' నెలకొల్పినారము. మానవసేవయె దేశసేవయు, దేశసేవయె యీశ్వరసేవయుఁ గావున, దీనిం జేఁబట్టి మీపట్టివలెఁ బోషించుభారము మీపయిం బెట్టినారము.

64 పుటలను గలిగి, చిత్రపటశోభిత మై విలసిల్లునీపత్రిక సర్వజనసులభముగ నుండునట్లు సంవత్సరమునకు రు. 3 లు మాత్రమె చందా నేర్పరచినారము. అభిమానులకు రు. 5 లు; పోషకులకు రు. 10 లు; రాజపోషకుల మూల్యగణము వారియనుగ్రహాధీనము.

# మానవసేవా గ్రంథమాల

## రాజమహేంద్రవరము.

1. కబీరు—ఇందు చరిత్రాంశము వచనముగను, ఉపదేశములు పద్యములుగ నుండును.
   అత్తిలి సూర్యనారాయణగారిచే రచింపఁబడినది. 0-2-0
2. బంగాళాదుంప—నిడుదవోలు వేంకటరావుగారి విరచితము. 0-2-0
3. అగ్గిపెట్టెలయంత్రశాల—కందుల శ్రీమన్నారాయణగారి విరచితము. 0-4-0
4 లోకపావనశతకము—ఇందలిపద్యములు భక్తిరసము నొలికించును.
   ఆదిపూడి సోమనాథరావుగారిచే రచియింపఁబడినది. 0-2-0
5. కోటిలింగశతకము—ఇందలిపద్యములు నీతిని, దేశభక్తిని బురికొల్పును.
   సత్యవోలు అప్పారావుగారిచే రచింపఁబడినది. 0-3 0
6. స్త్రీలయెడ మనము గావించు పంచమహాపాతకములు—
   నాళము కృష్ణారావుగారిచే రచింపఁబడినది. 0-1 0
7. వీరమతి—వీరరసప్రధానమైననాటకము. ఇందు దేశాభిమానము,
   స్వార్థత్యాగము, స్త్రీసాహసము ప్రదర్శింపఁబడును.
   మంగిపూడి వేంకటశర్మగారిచే రచియింపఁబడినది. 0-10-0
8. భారతీయసందేశము—స్వదేశాభిమానమును, విదేశయాత్రలవలనఁ గలుగు
   ప్రయోజనములను వెల్లడించు నొకభాగము. 0-1-0
9. భక్తితరంగిణి—ఇందు భగవద్భక్తి, దేశభక్తి, మానవసేవ మున్నగువాని
   గూర్చిన పద్యములు గలవు. 0-1-6
10. దేవేంద్రనాథచరిత్రము—అత్తిలి సూర్యనారాయణగారి విరచితము. 0 2-0
11. అనాథాభ్యుదయము—వితంతువులదురవస్థలును, వారివలన దేశమునకుఁ
    గలుగుమహోపకారములును దెలుపు భాగము. 0-2-0
12. క్రొవ్వొత్తులు చేయువిధము— 0-1-0
13. బాబా గురునానకు చరిత్రము—ఇ. సుబ్బకృష్ణయ్యగారి విరచితము. 0-1-0
14 ఆనందశతకము—ఇందలిప్రతిపద్యము భక్తిరసాస్పదమై యుండును.
   సూరాబత్తుల సూర్యనారాయణగారిచే రచింపఁబడినది. 0-2-0
15. ఉత్తమవివాహము—వివాహభేదములు, ధర్మములు, విధులు దెలుపును.
    పాలపర్తి నరసింహముగారిచే రచింపఁబడినది. 0-1-0

16 పన్నాబాయి—వీరరసప్రధానమైననవల. రాజకుమారునిఁ గాపాడుటకు నిజకుమారుని శాత్రవునికత్తి కెఱచేసిన యొకరాజపుత్రసాధ్వీమణి చరిత్రము. ఇందలిరాజనీతి, గూఢచారుల సమయోపాయములును జదివితీరవలెను.

సత్యవోలు అప్పారావు గారిచే రచింపఁబడినది. 0—8—0

17 హేలావతి—చరిత్రాత్మకమైననవల. ఒకమాఁస్త్రీ హుమాయూను చక్రవర్తియొక్క మంత్రికుమారుని వరించి పెండ్లియాడినకథ.

తల్లాప్రగడ సూర్యనారాయణరావు గారిచే రచింపఁబడినది. 0—4—0

18 ప్రభావతి—ప్రభావతీప్రద్యుమ్నమునకు సరియైనవచనము. పింగళి సూరనార్యుఁడే దీనిని వచనమున వ్రాసినట్లుండును.

నూరాబత్తుల సూర్యనారాయణ గారిచే రచింపఁబడినది. 0—4—0

19 మీరాబాయి—భక్తిరసప్రధానమైన పద్యకావ్యము. పతిచే నింద మోపబడి ప్రాణముల ద్యజించిన శ్రీకృష్ణభక్తురాలిచరిత్రము. ఇందలి పద్దెములు ముక్కుతిమ్మనార్యునిపద్దెములవలె ముద్దుగొలుకుచుండును.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారిచే రచింపఁబడినది. 0—4—0

20 కురుపాండవదాయభాగవిమర్శనము—ఇయ్యది శ్రీకాశీభట్ల బ్రహ్మయ్య గారి 'కురుపాండవదాయభాగవినిర్ణయము'పై వ్రాసినవిమర్శనము.

కవిరాజు శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారిచే రచింపఁబడినది. 0—1—6

21 బ్రహ్మమతము—ఇందు దేవుఁడు, మానవుఁడు, సృష్టి, ఉపాసన, పాపము—మోక్షము, అవతారములు—మహ్మనర్తులు, ప్రమాణగ్రంథము—ఈశ్వరప్రత్యాదేశము, సాంఘికాదర్శము మున్నగు విషయములు యుక్తియుక్తముగఁ జర్చింపబడినవి.

పాలపర్తి నరసింహము గారిచే రచింపఁబడినది. 0—8—0

22 ఆర్యసూక్తిముక్తావళి (ప్రథమభాగము)—ఇందు భారతమునందలి నీతులు, రాజధర్మములు ఏర్చి కూర్చఁబడినవి.

సత్యవోలు అప్పారావు గారిచే రచింపఁబడినది. 0—4—0

23 కర్ణభారము—ఇయ్యది కాళిదాసునకుఁ బ్రాచీనుఁడగు భాసమహాకవిచే రచింపఁబడిననాటకమునకుఁ దెనుఁగు.

మానవల్లి రామకృష్ణకవి ఎమ్. ఏ గారిచే నమునదింపఁబడినది. 0—3—0

# ఉద్బోధన

సీ. హరినామకథనదావానలజ్వాలచేఁ గాలవే ఘోరాఘకాననములు
పరమాత్మసన్నుతవాయుసంఘంబుచేఁ దొలఁగవే భవదుఃఖతోయదములు
కరుణానిధిధ్యానకంఠీరవంబుచేఁ గూలవే సంతాపకుంజరములు
నారాయణస్మరణప్రభాకరదీప్తిఁ దీఱవే సద్వ్యాప్తితిమిరతతులు
ఆ. జేసి దేవుభక్తి నావచేఁ గాక సం
సారజలధి దాటి చనఁగ రాదు
వేయుమాట లేల విష్ణుప్రభావంబు
సాటి వేఱొకండు జగతిఁ గలదె. 97

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే స్వామిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ను లాఱునే విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజలరాసు లింకునే హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే పరమేశనుతిరవిప్రభలు లేక
తే. నిరుపమాపునరావృత్తినిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ముఖ్యమైన
సర్వరంజనుచింతనాంజనము లేక
పరమయోగీంద్రులకు నైన నరసి చూడ. 98

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలుమధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాది యై చొక్కుకోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు
తే. నాదిదేవునిదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు
వేడ్క చెప్పఁగ మాటలు వేయు నేల. 99

సీ. పరమేశు నర్చించుకరములు కరములు, శ్రీకరు వర్ణించుజిహ్వ జిహ్వ
సుజనరక్షకుఁ జూచుచూడ్కులు, చూడ్కులు కరుణామయుని మ్రొక్కుశిరము
విష్ణు నాకర్ణించువీనులు వీనులు, మునివంద్యుఁ దవిలినమనము మనము [శిరము
భగవంతు వలగొనుపదములు పదములు, పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి
తే. దేవదేవునిఁ జింతించుదినము దినము
సర్వశక్తునిఁ బ్రకటించుచదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురువు గురువు
దైవతము జేరు మనియెడితండ్రి తండ్రి 100

సీ. కరుణాత్మునకుఁ గానికాయంబు కాయమే పవనగుంఫితచర్మభస్త్రి గాక
పరమేశుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే ఢమఢమధ్వనితోడిఢక్క గాక
హరిపూజనము లేనిహస్తంబు హస్తమే తరుశాఖనిర్మితదర్వి గాక
కల్యాణుఁ జూడనికన్నులు కన్నులే తనుకుడ్యజాలరంధ్రములు గాక
ఆ. స్వామి చింత లేనిజన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేనివిబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడిపశువు గాక 101

సీ. నారాయణునిదివ్యనామాక్షరములపైఁ గరఁగనిమనములు కఠినశిలలు
సవయాత్మకథలకు ముదితాశ్రురోమాంచమిళిత మై యుండనిమేను మొద్దు
జగదీశు మ్రొక్కనిజడునియౌదల నున్నకనకకిరీటంబు కట్టెమోపు
ఈశ్వరార్పితముగా నెసఁగనిసిరి వనదుగ్గచంద్రికావైభవంబు
ఆ. సలలితాత్మభజన గలిగి యుండనివాఁడు
గాలిలోన నుండి కదలుశవము
కలుషగహితుపదముఁ గననివానిబ్రదుకు
పసిఁడికాయలోనిప్రాణిబ్రదుకు 102

చ. హరి భజియించుహస్తములు హస్తము, లచ్యుతుఁ గోరి మ్రొక్కుత
చ్ఛిరము శిరంబు, విశ్వకరుఁ జేరినచిత్తము చిత్త, మీశ్వరే
శ్వరుఁ గనుదృష్టి దృష్టి, మునివంద్యు నుతించినవాణి వాణి, య
తురకథ లానుకర్ణములు కర్ణము లై విలసిల్లుఁ బో భువిన్ 103

సీ. విష్ణుకీర్తనముల విననికర్ణంబులు గొండలబిలములై యుండ కున్నె
సర్వేశుపద్యముల్ జదువనిజిహ్వలు గప్పలజిహ్వలై యుండ కున్నె
చిన్మయాకారు నీక్షింపనికన్నులు కేకిపింఛాక్షులు కాక యున్నె
కరుణాత్ముఁ బూజింపఁ గానిహస్తంబులు శవముహస్తంబులై చనక యున్నె
ఆ. ముక్తిదాయకునకు మ్రొక్కనిశిరములు
వానరశిరము లయి వ్రాల కున్నె
పతితపావనునుతిగతి లేనిపదములు
పాదపపదము లయి పరగ కున్నె. 103
సీ. అలరుజొంపములతో నభ్రంకషంబులై బ్రదుకవే వనములఁ బాదపములు
ఖాదనమేహనాకాంక్షలఁ బశువులు జీవింపవే గ్రామసీమలందు
నియతిమై నుచ్ఛ్వాసనిశ్వాసపవనముల్ పాలింపవే చర్మభస్త్రికలును
గ్రామసూకరశునకశ్రేణు లింటింటఁ దిరుగవే దుర్భాగ్యదీనవృత్తి
తే. సృష్టికరములౌ మోవవే యురుభగములఁ
బరమపురుషుని నెఱుఁగనిపురుషపశువు
లడవులందు నివాసములందుఁ బ్రాణి
విషయభరయుక్తితో మంట విఘల ధరయ. 104
సీ. హరికి నర్థముఁ బ్రాణ మర్పితంబుగ నుండువానికై వల్య మెన్వనికి లేదు
పతితపావనుభక్తవరుల సేవించినవానికైవల్య మెన్వనికి లేదు
పరమాత్మనిర్మలపరితపరుం డైనట్టివానికైవల్య మెన్వనికి లేదు
పరివిమలాత్మనికథాశ్రవణలోలుం డైనవానికైవల్య మెన్వనికి లేదు
తే. లేదు తపముల బ్రహ్మచర్యాదినియతి
శమదమాదుల సత్యశౌచములఁ దాన
ధర్మముఖముల సుస్థిరస్థాన మైన
బ్రహ్మవిజ్ఞానజనితనిర్వాణపదము. 105
చ. వరవిశ్వేశకథాసుధారసమహోవర్షోరుధారాపరం
పరలం గాక తలంచి చూడ నితరోపాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజనుస్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకనద్దావానలం బారునే. 106

గీ. చేతులారంగ శివునిఁ బూజింపఁ డేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁ డేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేనిఁ
గలుగ నేటికిఁ దల్లుల కడుపుఁ జేటు 107

క. హరిమహిమ తెలియుఁగువారికి
హరిగుణములు దలఁచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి
మరణాగతమోహసంభ్రమము లే దెందున్. 108

క. హరిదాసుల మైత్రిం గొని
హరిమహిమల నెన్నికొనుచు హర్షముతోడన్
భరితాశ్రుపులకితుం డై
పురుషుఁడు హరిమాయఁ గెల్చి ముక్తిం బడయున్. 109

క. ధర్మము సత్యముఁ గీర్తియు
నిర్మలదయ విష్ణుభక్తి నిరుపమఘనస
త్కర్మ మహింసావ్రతమును
నర్మిలి గలవారె పుణ్యు లవనీస్థలిలో. 110

క. కామింపకయును సర్వముఁ
గామించియు నైన ముక్తిఁ గామించి తగన్
లోమించి పరమపురుషుని
నేమించి భజించుఁ దత్త్వనిపుణుఁడు భక్తిన్. 111

క. మంగళహరికీర్తిమహో
గంగామృత మిందు నైనఁ గర్ణాంజలులన్
సంగతము సేసి త్రావఁ డొ
లంగును గర్మంబు లావిలం బగుచు వెసన్. 112

క. దేహము నిత్యము గా దని
మోహముఁ దెగఁ గోసి సిద్ధమునిగ్గై యఘసం
దోహము వెలువడి నరుఁడు
త్సాహమునం జెలఁగి ముక్తిసంపద నొందున్. 113

# ఆర్యసూక్తిముక్తావళి

## భాగవతము.

మ. లలితస్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమలవ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై 1

ఆ. వేదకల్పవృక్షవిగళితమై శుక। ముఖసుధాద్రవమున మొనసి యున్న
భాగవతపురాణఫలరసాస్వాదన। పదవి గనుఁడు రసికభావవిదులు. 2

మ. ఒకసూర్యుండు సమస్తజీవులకుఁ దా నొక్కొక్కఁడై తోఁచుపో
లిక నేదేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబులహృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండుసట్టిహరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై 3

ఉ. వాయువశంబులై యెగసి వారిధరంబులు మింటఁ గూడుచుం
బాయుచు నుండు కైవడిఁ బ్రపంచము సర్వముఁ గాలతంత్రమై
పాయుచుఁ గూడుచుండు నొకభంగిఁ జరింపదు కాల మన్నియుం
జేయుచు నుండుఁ గాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్. 4

సీ. ఒకకాలమునఁ బండు నోషధిచయము వే ఱొకకాలమునఁ బండ కుండు నండ్రు
క్రోధంబు లోభంబు క్రూరత బొంకును దీపింప నరులు వర్తింతు రండ్రు
వ్యవహారములు మహావ్యాజయుక్తము లండ్రు సఖ్యంబు వంచనాసహిత మండ్రు
మగలతో నిల్లాండ్రు మత్సరించెద రండ్రు సుతులు దండ్రులఁ దెగఁ జూతు రండ్రు
గురుల శిష్యులు దూషించి కూడ రండ్రు। శాస్త్రమార్గము లెల్లయుఁ జాగ నండ్రు
న్యాయపద్ధతి బుధులైన నడవ రండ్రు। కాలగతి వింతయై వచ్చు కాల మందు 5

క. దేహము నిత్యము గాదని। మోహముఁ దెగఁ గోసి సిద్ధమునివర్తనుఁడై
గేహము వెలువడునరుఁ డు। త్సాహముతోఁ బొందు ముక్తిసంపద ననఘా 6

# ఆర్య సూక్తి ముక్తావళి.

క. చెలఁగిరు కలఁగరు సాధులు। మిళితము లయి పరులవలన మేలుం గీడున్
నెలకొనిన నైన నాత్మకు। నొలయవు సుఖదుఃఖచయము యుగ్మము లగుమన్ 7

సీ. కమనీయభూమిభాగములు లేకున్నవే పడియుండుటకు దూదిపఱుపు లేల
సహజంబు లగుకరాంజలులు లేకున్నవే భోజనభాజనపుంజ మేల
వల్కలాజినకుశావళులు లేకున్నవే కట్ట దుకూలసంఘంబు లేల
గొనగొని వసియింప గుహలు లేకున్నవే ప్రాసాదసౌధాదిసటల మేల
ఫలరసాదులు గురియవే పాదపములు। స్వాదుజలముల నుండవే సకలనదులు
పొసఁగ భిక్షలు వెట్టరే పుణ్యసతులు। ధనమదాంధులకొలు వేల తాపసులకు 8

క. రక్షకులు లేనివారల। రక్షించెద ననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు నొకనరు। నక్షముఁ బ్రార్థింప నేల యాత్మజ్ఞులకున్. 9

క. ధర విరులు గంద కుండఁగ। సరసగతిం బూవుఁదేనెఁ జవి గొనునిందిం
దిరభృక్కై వడి బుధుఁ డగు। పురుషుఁడు సారాంశ మాత్రఁ బూని గ్రహించున్

క. కామక్రోధాదికముల్। భూమీశ్వర కర్మబంధములు మఱియును జే
తోమాలము లగుటను దా। రీమహిలో మనసు నమ్మ రెప్పుడుఁ బెద్దల్. 1

చ. తపమున బ్రహ్మచర్యమున దానమునన్ శమసద్దమంబులన్
జపమున సత్యశౌచముల సన్నియమాదియమంబులం గృపా
నిపుణులు ధర్మపద్ధతులు నిక్కము హృత్తనువాక్యజంపుపా
పపుగుది ద్రుంతు రగ్ని శతపర్వవనంబుల నేర్చుకైవడిన్. 1

ఆ. ఎఱుక గలుగువారిఁ జేసె యొనర్చిన। నది యొనర్తు రితరు లైన వార
లొఁడు సత్య మిట్టి దనె నేని లోకంబుఁ। దత్ప్రవర్తనమునఁ దగిలియుండు.. 1

చ. నయమును సత్యమున్ విడిచి ధర్మము మాని యశంబుఁ బాసి శ్రీ
జయములఁ బాఱఁ ద్రోలి పురుషత్వము గానక లోకనిందితా
హ్వయముఁ దనునానిచావునను నార్యులు గుందుదురే సృగాలముల్
ప్రియమున నంటునే శవముఁ బ్రేలిక చేరునె కంకగృధ్రముల్ 1

క. కీటకముఁ దెచ్చి భ్రమరము। పాటవమున ఝంఝరించు భంగిం దానై తం
త్కీటకము భ్రమరరూపముఁ। దాటించి వహించుఁ గాదె ధ్యానయోగమునన్.1

# చాణక్యశతకము

తే. సకలనయశాస్త్రములనుండి * సంగ్రహించి
రాజనీతులఁ దెలుపుశా*స్త్రం బొసఁగు
జనుల కుపయోగకర మగు*సరణి సగిసి
సార మెల్లను జాణక్య*శతక మనఁగ. 1

తే. చెలఁగ మున్ను చాణక్యుండు * చెప్పినట్లు
చెప్పెదను మూలసూత్రము * లొప్పమీఱ
దానిఁ దెలిసినయంతమా*త్రమునఁ జేసి
మూర్ఖుఁ డయినను బండిత*ముఖ్యుఁ డగును. 2

తే. అవనిఁ బాండిత్యమును వసు*ధాధిపత్య
మెప్పుడును దుల్యము లనంగ * నొప్ప వెన్న
రాజు తనదేశమునఁ బూజ్యుఁ * డిజగమున
నంతటను బండితుఁడు పూజ్యుఁ * డై తలిర్చు. 3

తే. బుధజనులయందు సుగుణముల్, * మూర్ఖులందు
దుర్గుణంబులు మిక్కిలి * తోఁచుఁ గాన
వేగు రున్నను మూర్ఖులు, * విజ్ఞుఁ డొకఁడె
మెచ్చుకొనఁబడు నది విద్య*మెఱుఁగు గాదె! 4

క. తల్లివలెఁ బరదారలఁ
బెళ్ళవలెఁ బరధనంబు * పృథివీస్థలిలో
నెల్లజనుల నాత్మవలెఁ
దెల్లంబుగఁ జూచువాఁడె * ధీమంతుఁ డగున్. 5

ఆ. కులము మంచి దైనఁ * గుణహీనుఁ డగునేని
ఫల మ దేమి? నీచ*కులజుఁ డైనఁ
దెలిసినట్టివాఁడు * దేవవర్యుల కైనఁ
బూజనీయుఁ డగుచుఁ * బొలుపుమీఱు. 6

ఆ. కోడెకాఁడు నైన * గోవాఁడు నైనను
వాసిఁ గన్నయింటి*వాఁడు నైనఁ
జదువు రానివాఁడు * సవ లేనిమోదుగు
పూవుపోలె వసుధఁ * బొసఁగఁ డెపుడు. 7

క. తారలకుఁ దొడవు చంద్రుఁడు,
నారులకున్ దొడవు ప్రాణ*నాథుఁడు దలఁపన్
ధారుణికిఁ దొడవు నృపుఁ డె
వ్వారికినిం దొడవు విద్య * పరికింపంగన్. 8

క. ఇల బాలునిఁ జదివింపని
తలిదండ్రులు శత్రు లనుట * తథ్యంబు సభా
స్థలులన్ వాఁ డెసఁగం డం
చలనమున్ గొక్కెరాయి*చందం బడరన్. 9

తే. నూఱుగుర మూర్ఖులం గని * నొగులుకంటెఁ
దనయు నొక్కని గుణవంతుఁ * గనుట మేలు
గుంపుగుంపులు చుక్కలు * గూడియున్న
నొక్కచంద్రుఁడె కద యిరుల్ * చక్కడంచు. 10

క. కృప నైదేఁడులు లాలిం
చి పదేఁడులు శిక్షఁ జదువు * చెప్పి సుతుని దం
డ్రి పదారవయేఁ డేతే
నపు డెద మిత్రుంవుపోలె * నరయఁగ వలయున్. 11

ఆ. నెత్తిఁ బెట్టుకొన్న * నెఱయు దోషంబులు
మొత్తుచున్న సుగుణ*ములు చెలంగుఁ
గనుక సుతుల, శిష్యు*లను బ్రీతి లాలింప
వలదు శిక్షచేయ*వలయుఁ జనులు. 12

క. పూచినగంధపుమ్రాఁ కొకఁ
డేచి వనం బెల్లఁ దావి * నెసఁగించుగతిన్
ధీచతురుఁడు సుతుఁ డొక్కఁడు
రేచి కులం బెల్ల నుద్ధ*రించు ధరిత్రిన్. 13

ఆ. తోఁటలోన నిప్పు*తోనున్నయొకవృక్ష
మెట్లు వనము నెల్ల * నెఱియఁ జేయు
మూర్ఖుఁ డైనకొడుకు * పుట్టినయే నల్ల
వంశ మెల్లఁ జెఱచు * వాస్తవంబు. 14

తే. మేటిపుట్టంబులను గట్టి * మెఱయుశాల్వఁ
జుట్టి డంబుగఁ గూర్చున్న*యట్టిమూర్ఖుఁ
డెడఁగ నోరెత్తకుండిన*యింతసేపె
కాఁడె పో ప్రకాశించుట * ఘనులచెంత. 15

తే. విషమునం దున్నయమృతంబు, * వెస నమేధ్య
మందు నున్నపసిఁడి, నీచు*నందు నున్న
యట్టిసద్విద్య, దుష్కుల*మందుఁ బుట్టి
యున్నస్త్రీరత్నమును గొన * నొప్పు జగతి. 16

క. పరమోత్సవదుఃఖపరం
పరలన్, గఱవులను, శత్రు*బాధల, రాణ్మం
దిరముల, శ్మశానగతులన్
బరఁగన్ విడ కెవ్వఁ డుండు * బంధువు వాఁడే. 17

ఆ. అవల దూరి కార్య * హానిఁ గావించుచు
నెదుటఁ బ్రియము లాడి * కదియుమిత్రు
నొప్ప మీఱునాప * యోముఖవిషకుంభ
మట్లు విడువ వలయు * నాత్మ నరసి. 18

తే. మొదల నొకమాఱు ద్వేషించి * పోవుమిత్రు
మరలఁ గలియంగ నెవ్వఁడు * మదిఁ దలంచు
నతఁడు మృత్యుముఖగ్రస్తుఁ * డగును గాఱు
టెండఁ బడునశ్వతరివోలె * నేపు దక్కి. 19

తే. బంటుఁ బరదేశ మంపుచో, * బందుగు వెఱ
నైనచో, మిత్రు నాపద * లంటుచో ని
జాంగనామణి నైశ్వర్య * మంత వోయి
నట్టిచోఁ జిత్తవృత్తుల * నరయవలయు. 20

క. తనయుపకారము నాశిం
చినశాత్రవుచేత శత్రుఁ * జీలింప నగున్
దనచేతిముంటఁ గాలం
గనఁబడు ములుఁ దీయునట్టి * క్రమము దలిర్పన్. 21

క. ఒకనికి నొక్కఁడు మిత్రుం
డొకనికి నొక్కండు శత్రు * వూరక యొకనాఁ
టికిఁ గలుగఁబోరు కారణ
మొకఁ డుండుం దాని కనుచు * నూహింప నగున్. 22

ఆ. ఖలుఁడు ప్రియము లాడి * తలముట్టి చెప్పిన
నమ్మి పనులు చేయ * నాశ మగును
వాసినాల్కకొనను * బూనుఁ దియ్యనితేనెఁ
గడుపునిండ విషము * గలిగియుండు. 23

# దుర్గావతి

## మొదటిప్రకరణము

ఉదయ మైనది మొదలుకొని దీపములు పెట్టువఱకు నుదరపోషణార్థము పెక్కు యంత్రతంత్రములు పన్నుకొని మర్గములోనికండెలవలె విరామము లేక సంచరించు మానవమనంబులకు విశ్రాంతి నొసఁగూర్చుటకై మహోపకారి యగుపరమేశ్వరుఁడు రాత్రిని సంకల్పించెను.

అట్టిసౌఖ్యదాయక మగు రాత్రి యాసన్నమగుడు విరహిజనాటవిని మదనాగ్ని యనెడుకార్చిచ్చు ప్రబల, వ్యాపించిన మేచకధూమసంచయమో యన సందెచీకటులు దిగంతముల నాక్రమించి బ్రహ్మాండము నంతయుఁ గప్పియుండె. నింగికిఁ జెలంగినకాఱు పొగలనడుమ దళముకొన్నవిస్ఫులింగములో యనఁ దారకలు పొడసూపె. క్రమక్రమముగా నారాత్రి భోజనములవేళ గడచి రమారమి రెండుయామములకాల మైనది. అయ్యెడ రాజస్థానమునందలిమీవారురాజ్యమునకు ముఖ్యపట్టణ మైనచిత్తూరునగర వీథుల నిశ్శబ్దము ప్రబలియుండె. ప్రజ లెల్లరును నొడ లెఱుంగక నిద్రించు చుండిరి. పొట్టకూటికై కొలువున కియ్యకొనినను బ్రతిజీవుఁడు సుఖమునే కోరును గావున నూరి కాపరులు కూడ నేమూలనో పడి నిద్రించుచుండిరి. ఆహా! నిద్రావస్థను మించిన సుఖ తర మగునవస్థ వేఱొండు లేదు. నిద్రాపరవశులకుఁ జింత లెక్కడివి? కానునకుఁ బ్రయాసపడి కూడదీసినధనరాసు లే మయ్యెనో వారి కక్కఱలేదు. సర్వముకంటెఁ బ్రియమైనభార్యాపుత్రు లే మైరో వారికి నంతకుముందే స్ఫురణమునందు లేదు. అట్టి వారికి లోకవ్యవహారముతో సంబంధ మే ముండును? అందుచేతనే ప్రజలనిద్రాసమ యమే దురాచారు లగుజారచోరులకుఁ దగినయదను.

ఆసమయంబున నొక్కబాలిక చిత్తూరురాజవీధిని జెంగుచెంగున నడుగు లిడుచు వడివడిఁ బోవు చుండెను. ఆమె యెచ్చటి కేగునో యామెకే తెలియదు. అప్పుడే తోఁచినచంద్రబింబంబుడంబు విడంబించుమొగంబుసొగసును, బెదరినలేడిచూపులు గల వెడందకన్నుఁగవయు, నామె సౌందర్యవతి యని చెప్పక మానవు. స్వాభావికసౌందర్యవతి యని చెప్పు చున్నప్పు డలంకారములను వర్ణింప నవసరము లే కున్నను వంశవివక్షం జేసి చెప్పక తీరదు. ముంగురు లనెడుపిల్లతుమ్మెదకదుపులు ప్రాకి ముఖాబ్జముశోభను హరింపకుండ నడ్డుకట్టిన ట్లనుసుముత్యాలపాపటసరములచే వేరిలుకెంపులు గూర్చిన బంగారులలాటిక మాచిన్నది ధరించినది. ముంజేతులకు రెండేసిజతలయపరంజిగాజు లొప్పి యున్నవి. ఎడమచేతిగ్రౌదువేళ్ళకు నుంగరము లంగుదీర్చినవి. కెంపుపోఁడులు గూర్చినముక్కుపుల్లలు తప్ప బులాకి యామెముక్కున లేదు. నడినెత్తినుండి చెవులను గప్పి తెల్లనిమేలిముసుఁ గుండుటచేఁ గర్ణాభరణము లేమున్నవో చెప్ప నవకాశము లేదు. కట్టుకొన్నపట్టుపావడకుచ్చెళ్ళు క్రిందికిఁ జీఱాడకుండుటచేఁ గాలువకు రెండుజతలుగా ధరించినకడియములును, పాదాంగుళులఁ జెల్వొందుమట్టెలు, పిల్లాఁడులు వెన్నెలచే ధగధగ మెఱయుచున్నవి. ఆమె యబల యని యబలగాఁ గన్పట్టదు. నూతనముగా నంకురించినయౌవన మామెఘనశోభనశరీరమునకు మఱికొంత వింతకాంతిని బొందుసేయ మెఱుపుఁదీఁగవోలె నాబాల దుఱంగలించుచున్నది. నవీనయౌవన యనుటచేఁ బదునైదు వత్సరములకంటె మించినవయస్సు గలదిగా ననుకొనలేము. ఆమె గుణవతియో, యగుణవతియో చర్యలవలనఁ గాక రూపముచే నెఱుంగుటకు వీలు లేదు.

అప్పటికి వెన్నెల నిండారఁ బిండారఁబోసినవాసిగ బ్రహ్మాండమునం దెల్లెడల మెండుకొని యుండుటచే నామెజాడ లొరు లెఱుంగుటకు వీలుగా నున్నది. చల్లని మనోహరమైనయావెన్నెల యప్పటిస్థితియం దామెకు నపకారకము లై కన్పట్టె.

అట్లా రాజవదన రాజవీధిం బడి యడుగులు తడఁబడ దడదడ నడచుచుండ నొక యౌవనపురుషుఁడు వెనువెంటఁ జని “ప్రాణేశ్వరీ! యెక్కడి కేగెదవు? నిలువుము నిలువు” మని వచించెను. ఆకంఠధ్వని వినఁబడినతోడనే యామెహృదయము జల్లు

మనియెు. మేనఁ బుల్కలు వొడమె. మోమునఁ జెమటచెమ్మట లంకురించె. అంత నాపురుషుఁ డెదుటికి వచ్చి నిలుచుడు నామె నిశ్చేష్టయై కొంతవడి నిలిచె.

ఈనడుమ నాపురుషునిగూర్చి కొంత ముచ్చటించుకొందము. అతఁ డెఱ్ఱనివారిలో నల్లనివాఁడు. నల్లనివారిలో నెఱ్ఱనివాఁడు. దీర్ఘకాయులలోఁ బొట్టివాఁడు. పొట్టివారిలోఁ బొడవైనవాఁ డని యనిపించుకొనును. విశాలము లేనిఫాలభాగమును, దీర్ఘనాసికయు, నప్పటికిఁ గొంచెము పెనవెట్టుటకుఁ దగియున్నగటిమీసములును నాతని విగ్రహవర్ణనమును గొంతవఱకుఁ బూర్తి చేయఁ గలవు. తురకలకువలె గడ్డ మాతనికి లేకపోవుటచేఁ బసిపిల్లలు, స్త్రీలు భయ మొందక యాతనియాకారముఁ గొంతవఱకుఁ జూడఁ గల రని తలంప వచ్చును. ఆతఁడు తెల్లనియిజారును, నల్లనియంగరకాయును దొడిగి తలకుఁ జెంపపాగా చుట్టి యుండెను. అంగరకా శరీరమున బిగువుగ నంటియుండుటచే బొజ్జగొజ్జ దృశ్య మగుచున్నది. ముంజేతికి ధరించినపచ్చలకంకణ మాతఁడు ధనవంతులలో ధనవంతుఁ డని సాక్ష్యమిచ్చుచున్నది. చిన్నతనమునాఁటి యాతనిదుండగపుఁ జేష్టలవలనఁ జెలికాం డ్రాతని "మోటూ" యని పిలుచు చుండెడివారు. విగ్రహము పుష్టిగా నున్నను నాతని కప్పటికి నిరువదియేండ్లకు మించినయీడు లేదు.

ఇట్టిస్వరూపమును గాంచి చేష్ట లుడిగియున్నయాచిన్నది ధైర్యశాలిని గావున వెంటనే మనోధృతి గలిగి యెఱ్ఱఁజూపుల నాతనివంకఁ జూచుచుఁ జూచుచు "స్త్రీని సంతాపమునందు ముంచుట యేమిటిన్యాయము? దుష్టుఁడా! పొమ్ము పొమ్ము. నాతండ్రి యక్రమముగా నన్ను నీపాలుచేసెను." అని పలికెను. అందుపై "భర్తను నిందించుట నీకుఁ దగదు. రమ్ము. రమ్ము." అని మోటూ ప్రత్యుత్తర మొసఁగి చేయి పట్టుకొనఁ బోఁగా, నామెయు బల మైనది కావున వెంటనే చేయి విదలించుకొని ప్రక్క నున్న యొకగల్లీనుండి కాలువిసరున సాగిసాగి "జనార్దనా! శరణు. శరణు." అని గద్గదస్వరముతో మొఱ్ఱవెట్టెను. అంత నొకలేఁబ్రాయమువాఁడు "ఆ! యిదే వచ్చుచున్నాను" అని పలికి తక్షణము యామెకుఁ దారసిల్లెను. మీసము తిన్నఁగాఁ గనఁబడనందున నాతని లేఁబ్రాయమువాఁ డనవలసి వచ్చెను గాని యతనివయస్సు ముప్పదిసంవత్సరముల కంటె రెండుమూఁ డెక్కువగనే యుండును. పేడివాఁ డన నందగాఁడు కాకపోఁడు. ఆతనిముఖవైఖరి గన్నఁ బురుషులకేని వలపు జనింపక మానదు. ఆశుభాకారము గన్నుల

బడఁగానే యాబాల పెన్నిధానము దొరికినయట్లు పరితుష్ట యయ్యె. అప్పు డాపురుషోత్తముఁడు తనమొలనుండి యొక్కచురియ నూడఁబెఱికి యాచిన్నదానివెంటఁ దగిలియున్న మోటాను నదలింపఁగా నాతఁడు గుబాలునఁ బాఱిపోయెను. మనక్రొత్త తెరువరి యాదుండగీని జంపవలె నని కొంతవఱకు వెంబడించెను. కాని నిరాయుధుఁ డైన యాతఁడు ప్రాణభీతిచే నెచ్చటను నిలువ సాహసింపఁ జాలక యదృశ్యుఁ డయ్యెను.

అనంతర మాక్రొత్తపురుషుఁడు తనలో “నాపేరీమె కెట్లు తెలిసినది? జనార్దనా యని పిలిచినదికదా?” యని యనుకొనెను. దానంజేసి యాతనిపేరు జనార్దనుఁ డనియు రసపుత్రుఁ డగుటచే సింగుశబ్దము సాధారణముగ నొనరును గావున నాతనిపరిపూర్ణనామము జనార్దనసింగనియు స్పష్ట మగుచున్నది. జనార్దనసింగునకు నాయంగనకు సంభాషణ మీరీతి జరిగె.

జనార్దనసింగు—“అమ్మా! నాపేరు నీ వెట్లెఱింగితివి? జనార్దనా యని పిలిచిన దానవు.”

బాలిక—“అయ్యా! మీపేరు గాని మిమ్ములను గాని నే నెఱుంగను. జనార్దనా యని పరమేశ్వరుని వేఁడికొంటిని. నాపాలిఁటిప్రత్యక్షజనార్దనుఁడ వై యభయ మొసంగితివి. ఇదే నమస్కారము.”

జనార్దనసింగు—“అమ్మా! నీకు వచ్చినభయము లేదు. నీవు న న్నెఱుంగ కున్నను నేను ని న్నెఱుంగుదును. నాకంటె ని న్నెక్కువగఁ బ్రేమించెడువారు లేరు. అయ్యది నీవు క్రమముగా నెఱుంగఁ గలవు. నీతండ్రి కృతఘ్నుఁడు. భార్యాజితుఁడు. నీ వైన నన్నుఁ బ్రేమతో నాదరింపు” మనెను.

అప్పుడు చల్లనిమలయమారుతములు మెల్లమెల్లన వీచుచుండుటచే నిశాంతము కావచ్చిన దని తెలియుచున్నది. అచ్చటచ్చటఁ గలయుద్యానవనంబులనుండి శకుంతములవింతరవము లెడపదడప వినఁబడుచున్నవి. చంటిపిల్ల లుగ్గునకై యేడ్వఁ బడకనుండి లేవఁ జాలక శిశువులను జోకొట్టుచుఁ దల్లులు పాడుచున్న యల్లిబిల్లిజోలపాటలు కూడ వినంబడుచున్నవి. భక్తులు గీతగోవిందము పాడుచుండిరి. సన్యాసులు గంజాయి పీల్చుచు

నడుమనడుమ “జయ్ సీతారామ్” అని కేకలు వెట్టుచుండిరి. కానురాను గాకులు కావుకావు మని కూయ సాగెను.

అంత జనార్దనసింగు “అమ్మా! యిచ్చట మన మింక నుండరాదు. ఇట కనతి దూరమున నున్న సీతానగరమున నేను వసింతును. అటకుఁ బోవుదము రమ్మా” అని చెప్పఁగా బాలిక జనార్దనసింగుపై మొదటనుండియు నాత్మబంధుప్రీతి వెలసిన దగుటచేఁ దత్క్షణమే యాతనివెంటఁ జనెను.

# రెండవ ప్రకరణము.

క్రీ. శ. 1530 సంవత్సరమున మొగలాయిప్రభు వగు బేబరు మృతినొందినపైని నతనిజ్యేష్ఠపుత్రుఁడు హుమయూను సింహాసన మెక్కెను. అతఁడు సింహాసనారూఢుఁ డైనసంవత్సరమునకు బుందేల్‌ఖండముమీఁదికిఁ దొలుత దండయాత్ర సాగించి కళింజర్ దుర్గమును స్వాధీనముచేసికొని, యచ్చటఁ దనయాశ్రితుఁ డైనఅజాఫ్‌ఖానుని సుబేదారుగ నియమించెను.

అజాఫ్‌ఖానుఁడు తొలుత హుమయూనునిసైన్యమునం దొకచిన్నయుద్యోగమునం దుండి ముఖప్రీతివాక్యములు పలుకుటయం దెక్కుడునైపుణ్యము గలవాఁ డగుటచేఁ గ్రమక్రమముగా నాచక్రవర్తి కాంతరంగికుఁడై ప్రబలె. ఆతఁడు తెల్లనికాకి గలదని చెప్పఁ జక్రవర్తి నమ్మెడువాఁడు. కావునఁ జక్రవర్తి యాతని కాగొప్పయుద్యోగమును బ్రసాదించెను. ఆతఁడు చక్రవర్తిసమక్షమున నున్నకాలములో నెవరిమాటయు నచ్చట నెక్కకుండెను. అట్టియాఖానునకు నున్నతపదవి సిద్ధించినందున కసహనముఁ బొందుటకు మాఱుగా ఢిల్లీయాస్థానములోనివారందఱు నానందించిరి.

ఖాను కళింజర్‌పురమున నుద్యోగములోఁ బ్రవేశించినకొలఁదికాలములోనే యచ్చటిహిందూరాజకీయోద్యోగస్థులనెల్లఁ దొలఁగించి తన కాప్తులైనముష్కరతురుష్కుల నాయాపదవులయందు నెలకొల్పెను. రానురాను ఖానున కామహోన్నతపదవితో మదోన్మత్తతయు నధికము కాఁగాఁ గొందఱుదుర్మార్గులను జేర్చుకొని వారిచే హిందువులగృహములు దోపించియు, బందిపోటులు చేయించియు, స్త్రీలను జెఱఁబట్టించియు, బాధించుచుండెను. ఇటీవల హిందువు లందఱాతనిదుర్నయప్రవర్తనమునకుఁ దలఁకి యనుసరించి తిరుగుచున్నను లోలోన నసూయ వహించినవారలే యైరి. క్రమక్రమముగాఁ జేయించినదోపిడులవలన ఖాను ధనాఢ్యుఁడై వందలకొలంది దుష్టులను దన చెప్పుచేతలలో నుంచుకొని, తనయధికారము నిరంకుశంబుగ సాగునట్లు బలపఱచుకొనెను. అప్పుడు ఖానుగారే పాదుషా యని ప్రజల కభిప్రాయము గలిగి యుండెను.

తరువాతఁ గొన్నినాళ్ళకు నేనుఁగునకు వెలగపండ్లు లొటలొట యనునట్లు, ఖానుగారికిఁ జిన్నదోపిడులవలన సంతృప్తి లేకపోవుటచేఁ దనచుట్టుప్రక్కల నున్నరాజులయైశ్వర్యములపైఁ గన్నువేసి, వారిలో వారికిఁ గలహములఁ గల్పించి, తా నొకరిపంకఁ జేరి, యింకొకరిపై దాడి వెట్ట సాగెను. ఇట్టివ్యాపారముచే హిందూరాజుల కందఱ కాతనియెడఁ గొంతగౌరవము గలిగి యుండెను. కాని, యాగౌరవ మెంతయో కాలము నిలువలేదు. ఎందు కనఁగా ఖానుగారు తనవిభవమును జూచికొని మన్నుమిన్నులు గానక రాజ్యజిగీష గలిగి యెల్లహిందూరాజులతోఁ జీటికిమాటికిఁ గయ్యమునకుఁ గాలు దువ్వుచుండెను. కాలక్రమంబున తొండ ముదిరి యూసరవెల్లి యైనచందంబున ఖానుగా రొకపాదుషావలె మాఱి హిందూరాజులను వారిసుందరనందనలను దనకు వివాహముచేయవలసిన దనియు, ధనము లీయవలసిన దనియు ననయంబు బాధింప సాగెను. ఖానున కెవనిపైఁ గార్పణ్యము వొడమునో వానిబ్రతు కంతటితో మట్టము గావలసినదే. ఏస్త్రీ యైన వానిదృష్టిఁ బడెనేని నామె భర్తకుఁ గానిభార్య కావలసినదియే.

ఖానుగారిదుర్న్యయాపుచర్యలకుఁ దలఁకి కొందఱుకొందఱు హుమయూనునకు మహజర్జీ లెన్నియో యిచ్చుకొనిరి గాని ఖాను చక్రవర్తిని జేబులో వేసికొని యున్నందున నవి యన్నియుఁ బుట్టదాఖలు చేయఁబడుచుండెను. హుమయూన్‌పాదుషాపై హిందువుల కదివఱకుఁ గలయభిమానగౌరవము లీఖానుగారికి నున్నతోద్యోగ మిచ్చుటఁ జేసి కొలఁది యయ్యెను.

ఖానుగారిమిత్రమండలిలో నొక్కదుల్పట్‌పాతప్ప మంచిని బోధించుసన్మార్గుఁ డొక్కఁడును లేడు. పదుగురుదుర్జనులలో నొక్కసజ్జనుని లెక్క యేమిటి? దుల్పట్‌పా మధ్యహిందూస్థానములోని గఢామండలమునకు రాజు. ఆతనికి ఖానుగారిఘోరప్రవర్తన మెంతమాత్రము నచ్చకపోయినను గోరి వైరముఁ దెచ్చిపెట్టుకొనుట మంచిది కాదని యాతని ననుసరించి నట్లే యుండి దినములు గడపుచుండెను. అందుచేతనే యాతఁ డింకను ఖానుగారికోపానలజ్వాలకుఁ బాల్పడక నిలిచి యుండెను.

అట్లు నిరంకుశప్రభుత్వము సాగించుకొనుచున్న అజాఫ్ ఖానుఁడు తాను బెట్టిన రాయబారమును దిరస్కరించినందునఁ గనోజరాజుపైఁ గసిదీర్చుకొనుటకు నిశ్చయించుకొని చక్రవర్తియనుమతిఁ గోన నెన్నియో కృత్రిమంబులు పన్ని యాతనికి నివేదించుచున్నను సదయుఁడైన యాతఁ డందుల కియ్యకొనలేదు. ఖానుగారు కనోజరాజును వంచింప శక్తి వంచన లేక పునఃపునఃప్రయత్నములు సేయుచుండెను.

అజాఫునకు రహీమాక్, అబ్దుల్ ఖాను లనువారలు ప్రియమైనయాంతరంగికులు. వార లిరువురుఁ దనకు రెండుభుజము లని అజాఫ్ భావించెడివాఁడు. కావుననే యాతఁడు వారలను దనపాలనముక్రింద నున్నరెండుగ్రామములకు ఖిల్లేదారులుగఁ జేసి యుంచెను. కలుకుతురక లన్న వారికే చెల్లు. ఒక్కొక్కసమయమునందు అజాఫునకు దయ యనునది లేశమాత్రము గలుగుచుండెను గాని వారియందట్టిది యెప్పుడును సంభవింపదు. వారికి నరహత్యలు సేయఁ గరములు జంకవు. బందిపోటులు సలుప డెందంబులు వెనుదీయవు. అట్టివారికిఁ బరస్త్రీగమనము సుగమమైన దని వేఱ చెప్ప నేల? వారికి కుల్పట్ షాపై నసహనము సహజముగా నుండుటంజేసి యాతని వంచింప ఖానుగారికడ మిత్రభేదము పన్నుచుండిరి.

# ధర్మపుత్రుడు

పూర్వ మొకబీదకృషీవలుఁడు రష్యాదేశములోఁ గాయకష్టముచే జీవించుచుండెను. వానికొకపుత్రుఁడు జన్మింప, వాఁ డమితానందభరితుఁ డయి, నామకరణోత్సవము జరుపఁ దలపెట్టెను. వాఁడు క్రైస్తవుఁడు. క్రైస్తవులలో నామకరణోత్సవము ధర్మమందిరమునఁ గావింపఁబడును. ఆసమయమున శిశువునకుఁ గ్రీస్తుని పేరున నభిషేకము జేయఁబడును. దీనిని వారు 'క్రిసెనింగు' అని పిలిచెదరు. ఈయుత్సవాంతమున నొక పురుషుఁడును నొక స్త్రీయును శిశువునకు ధర్మపితగను ధర్మమాతగను నుండ నీయకొనెదరు. వీరు శిశువుయొక్క ధర్మజీవనసంఘటనకయి బాధ్యతను వహించెదరు. ఇది క్రైస్తవుల యాచారము. కానఁ గృషకుఁడు తనముద్దుబిడ్డకొఱ కొకధర్మపితను, ధర్మమాతను సంపాదింపవలసియుండెను.

వాఁడు ప్రథమమున గ్రామములోనియొక పెద్దమనుష్యునివద్ద కేగి వానినిఁ దన యనుంగుబిడ్డకు ధర్మపితగ నుండు మని కోరెను. ఆయన యందులకు సమ్మతింపలేదు. దరిద్రునిబిడ్డకు ధర్మపిత దొరకుట దుర్లభము. కృషికుఁ డింకొకమనుష్యునివద్దకుఁ బోయి, తనబిడ్డకు ధర్మపితగ నుండు మని వేఁడఁగా, నాయనయుఁ దనయనంగీకారమును దెలిపెను. వాఁడు వరుసగ నొకనితరువాత నొకనిని సమీపించుచు, గ్రామములోనియందఱివద్ద కరిగెను. ఎవరును వానిపుత్రునకు ధర్మపిత యగుట కొప్పుకొనలేదు. వాఁ డప్పుడు గ్రామాంతర మేగుచుండ, మార్గమున నొకపరిచయము లేనిమనుజుని నెదుర్కొనెను. ఆయపరిచితుఁ డాఁగి వానికి నమస్కరించి "ఓమిత్రమా! సుప్రభాతము. పరమేశ్వరుఁడు నిన్నెచటికిఁ దీసికొనిపోవుచున్నాఁడు?" అని ప్రశ్నించెను.

"భగవంతుఁడు నా కొకబిడ్డను బ్రసాదించెను. వాఁడు నాయౌవనమున నాకు చేతోత్సవముఁ గొలుపును; నావార్ధక్యమున మనోల్లాసము గలిగించును; నామరణానంతరము నాయాత్మశాంతికయి ప్రార్థించును. కాని యిట్లు సతతము సంతోషము నొనఁగూర్చు నాయనుంగుబిడ్డను నేను దరిద్రుఁడ నని స్వగ్రామమున నెవరును వానికి ధర్మపిత యగుట కిష్టపడరయిరి. కనుక నాపుత్రునకు ధర్మపితను నెవరి నయినను బడయువలె ననునాశతో గ్రామాంతర మేగుచున్నాను." అని కృషకుఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

"నేను నీపుత్రునకు ధర్మపితగ నుండెదను" అని యాయపరిచితుఁడు నుడివెను.

కృషికుఁ డానందపరవశుఁ డయి యాయనను దీవించి "ధర్మమాతగ నుండు మని యెవరినిఁ గోరుదును?" అని యడిగెను.

"మంచిది. వర్తకునికుమార్తెను ధర్మమాతగ నుండు మని వేఁడుము. పట్టణమునకుఁ బోయిన బజారులో నొక పెంకుటింటియందు వసేకదుకాణములఁ జూచెదవు. ఆయింటి గుమ్మమువద్ద కరిగి వర్తకునిఁ బిలిచి నీపుత్రునికి ధర్మమాతగ నుండుటకుఁ దనపుత్రిక కనుజ్ఞ నిమ్మని ప్రార్థింపుము." అని యాయపరిచితుఁడు చెప్పెను.

కృషికుఁడు సందేహించుచు "నావంటిదరిద్రుఁడు ధనికుఁ డగునావర్తకునివద్ద కేగు టెట్లు? వాఁడు నన్నవమానించి పంపివేయును; తనకుమార్తె వచ్చుటకును నియ్యకొనఁడు" అని యనెను.

"అట్లు నీవు సందేహింపకుము. నీకుఁ జెప్పినవిధమునఁ బోయి వాని నడుగుము. రేపుదయము నీపుత్రునినామకరణోత్సవమునకు నేను వచ్చెదను. అంతయు సిద్ధము చేయుము" అని ధైర్యము జెప్పి యాయపరిచితుఁడు తనమార్గమునఁ బోయెను.

కృషీవలుఁడు తిరిగి పట్టమునకు వచ్చి యచ్చట వర్తకునియింటిని వెదకి కనుఁగొని వానిని వెలుపలకుఁ బిలిచెను. వర్తకుఁడు బయటికి వచ్చి "నీ కేమి కావలయును?" అని యడిగెను.

"అయ్యా! ఇదిగో నావిన్నపము. నాయౌవనమున నాకు నేత్రోత్సవముఁ గొలుపుటకును, నావార్ధక్యమున నా కానందముఁ గలిగించుటకును, నామరణానంతరము నాయాత్మశాంతికయి ప్రార్థించుటకును, విధాత నా కొకబిడ్డను బ్రసాదించెను. మీరు మీపుత్రికను వానిధర్మమాతగ నుండుట కనుమతి నిండు" అని కృషీవలుఁడు ప్రార్థింప, వర్తకుఁడు "నీబిడ్డయొక్క నామకరణ మెప్పుడు?" అని ప్రశ్నించెను. పిమ్మట కృషికుఁడు "రేపు జరుప నిశ్చయించినాము" అని చెప్పఁగా, వర్తకుఁడు "మంచిది, పరమేశ్వరుఁడు నీకుఁ దోడ్పడును గాక! రేపు ప్రాతఃకాలమున నాకుమార్తె నీయింటికి వచ్చును." అని నుడివెను.

మఱుసటిదినమున ధర్మపితయు ధర్మమాతయు నిద్దఱును వచ్చిరి. పుత్రుని కభిషేకమును నామకరణమును యథావిధిగ జఱుపఁబడెను. ఉత్సవము ముగిసినతోడనె ధర్మపిత యచటనుండి వెళ్ళిపోయెను. ఆయన యెవరో యెవరికినిఁ దెలియకుండెను. దీనితరువాత సహిత మాయన యెవరికినిఁ గాన్పింపలేదు.

# 11

శిశువు దినదినప్రవర్ధమానముగఁ బెరుగుచుఁ దల్లిదండ్రులయానంద మధికము జేయుచుండెను. వాఁడు బలవంతుఁడును, పాటుపడువాఁడును, బుద్ధిమంతుఁడును, గుణవంతుఁడును, నయ్యి యుండెను. వానితల్లిదండ్రులు వానిని పదియవయేటఁ జదువును వ్రాయను నేర్చుకొనుటకుఁ బాఠశాలకుఁ బంపిరి. ఇతరబాలు రయిదేండ్లలో నేర్చుదాని నీబాలుఁ డొకసంవత్సరములో ముగించెను. స్వల్పకాలములోనె యావిద్యాలయము నందు బోధింపఁబడునది యంతయు వానియధీనమయ్యెను.

ఈశ్వరపండుగ వచ్చినందున, బాలుఁడు తనధర్మమాత కాపండుగసందర్భమున నమస్కృతు లర్పించునిమిత్త మామెవద్దకుఁ బోయెను. వాఁ డామెకు నమస్కరించి యామెయాశీర్వచనములఁ గైకొని యింటికిఁ దిరిగివచ్చెను. తరువాత వాఁడు తనతల్లిదండ్రులను బిలిచి "నాధర్మపిత యెచట నున్నాఁడు? వానికిఁ గూడ నీసమయమున నాప్రణామము లొసంగి వచ్చెదను" అని యడిగెను.

"వత్సా! నీధర్మపిత యెచట నున్నది మే మెఱుఁగము. అందువలన మామనస్సునకును గష్టముగ నున్నది. నీనామకరణానంతరము మా కాయనదర్శనము తిరిగి కాలేదు. నేటివఱ కాయనసమాచార మేమియుఁ దెలియదు. ఆయన యెక్కడ నయిన జీవించియున్నది, లేనిది కూడఁ దెలియదు." అని వానితండ్రి ప్రత్యుత్తర మిచ్చెను.

బాలుఁడు తల్లిదండ్రులకు నమస్కరించి "అమ్మా! నాయనా! నాధర్మపితను వెదకుటకుఁ బోయెదను. మీరు నా కనుజ్ఞ నిండు. నేను వానిని వెదకి తోడ్కొని వచ్చి పుణ్యాహపుముచ్చటలు దీరిచెదను." అని చెప్పెను.

తల్లిదండ్రులయనుమతిఁ బడసి బాలుఁడు ధర్మపిత నన్వేషించునిమిత్తము బయలు వెడలెను.

బాలుఁడు గృహము విడిచి మార్గమున సగముదినము నడచినపిదప, నొకయపరిచితుఁడు వాని నెదుర్కొనెను. ఆపురుషుఁ డుచితరీతి వాని నాదరించి "వత్సా! భగవంతుఁడు నిన్నెచ్చటికిఁ గొంపోవుచున్నాఁడు?" అని యడిగెను.

"ఈస్టరుపండుగసందర్భమున నేను నాధర్మమాతకు వందనము లాచరించి యింటికి వచ్చి "నాధర్మపిత యెక్కడ నున్నాఁడు?" అని తల్లిదండ్రులను బ్రశ్నింప, వారు "వత్సా! నీధర్మపిత యెచట నున్నదియు మాకుఁ దెలియదు. నీనామకరణముఁ జేసి యాయన యెచటికో వెళ్లిపోయెను. పిమ్మట నాయనసమాచార మేమియుఁ దెలియదు. ఆయన బ్రదికియున్నది లేనిది కూడఁ దెలియదు." అని చెప్పిరి. ఆయనను దర్శింపవలెననుకోరికతో నే నిప్పు డాయనను నారయుచుఁ బ్రయాణము చేయుచున్నాను." అని బాలుఁడు తెలుప, నా యపరిచితుఁడు "నేనె నీధర్మపితను." అని చెప్పెను.

బాలుఁడు సంతోషించి యాయనకు నమస్కరించి "ధర్మపితా! మీ రెటు పోవుచున్నారు? మాగ్రామమువైపున కయినయెడల, నావెంట రండు; మిమ్ము మాయింటికిఁ దీసికొనిపోయెదను. లేక మీయింటివైపున కయినయెడల, నేను మీవెంట వచ్చెదను." అని యడిగెను.

"నీవెంట నీయింటికి వచ్చుటకు నా కవసరము లేదు. గ్రామములోఁ గొంచెము పని యున్నది. పోవుచున్నాను. రే పింటిలోనె యుండెదను. కనుక రేపు నాదగ్గఱకు రమ్ము." అని ధర్మపిత చెప్పెను.

"మి మ్మెట్టుల నేను కలసికొనఁగలను?" అని బాలుఁ డడుగ, "తూర్పుదిక్కునకు సూటిగఁ బొమ్ము. కొంతదూరము పోఁగా, నొకయడవి కాన్పించును. దాని నడుమఁ గొంతసేద్యపుభూమి కలదు. ఆశుభ్రమయినప్రదేశమునఁ గూర్చుండి శ్రమఁ దీర్చుకొనుము. అచట నేమి జరుగునో పరిశీలింపుము. వనమునుండి వెలుపలకు వచ్చిన నొకయుద్యానముఁ గనుఁగొందువు. ఆయుద్యానమునడుమ నొకప్రాసాదము దాని స్వర్ణనిర్మితాచ్ఛాదనము గాన్పించును. అది నాగృహము. ద్వారమునద్దకు రమ్ము. నేను స్వయముగ వచ్చి నిన్ను లోనికిఁ గొంపోయెదను." అని ధర్మపిత చెప్పి బాలునిదృష్టి [illegible]

# హిందూసంఘసంస్కరణము

సంఘసంస్కరణ మీభరతఖండమునం దొకనూతనోద్యమము కాదు. ఇది బహు పురాతన మైనది. దీనిచరిత్రము మిక్కిలి ప్రాచీనముగను దీర్ఘముగను నున్నది. కావున దీనినిగుఱించి విపులముగ వ్రాయుట కిది సమయము కాదు. ఈచరిత్రను ఆదియుగము, మధ్యయుగము, నవీనయుగము, అని మూడుభాగములుగ విభజింపవచ్చును. సమస్త యుగములయందును ఈయుద్యమము సంఘములోనిదురభ్యాసముల బోగొట్టుటకై ప్రారంభింపఁబడినను, ఒకయుగమునందలియుద్యమమునకును మఱియొకదానియందలి యుద్యమమునకును విశేషభేదములు గన్పడుచున్నవి. ఆదియుగచరిత్రను విమర్శించుట యందు పురాణేతిహాసములే మన కాధారగ్రంథములు. సంఘమునందలిప్రజలకు వేద శాస్త్రపురాణములయందు గౌరవము క్షీణించుటయే యాయుగమునం దొకగొప్పలోప ముగ నెంచబడియె. కావున ప్రాచీనధర్మశాస్త్రనిబంధనల సంఘమునందు వ్యాపింపఁ జేయుటయే అప్పటిసంస్కర్తలయుద్దేశము. వే ఱెట్టికార్యమును వారు చేయ నిష్టపడిన వారు కారు. కృష్ణాద్యవతారరూపమున జన్మించినభగవంతుఁడే యాయుగమందలి సంస్కర్త.

రెండవది యగుమధ్యయుగమున అసమానవిద్యావివేకశౌర్యధైర్యములు గలిగిన మహాపురుషులే సంస్కర్తలు. శంకరుఁడు, రామానుజచైతన్యాదివైష్ణవమతకర్తలు, కబీరు నానకు మొదలగువా రీయుగమున ప్రఖ్యాతి గాంచిరి. వీరిప్రధానోద్దేశము మత బోధయే యైనను వీరిలో గొందఱు సంఘసంస్కరణముఁ గూడ గావించిరి. జాతిభేదములు, స్త్రీస్వాతంత్ర్యము, నిమ్నజాత్యుద్ధరణ మొదలగువిషయములయందు శ్రద్ధవహించి వీరు కొన్నియవసరమైనమార్పులఁ గావించిరి. వీరు శాస్త్రములనె కొంతవఱ కాధారముగఁ జేసికొనినను స్వబుద్ధిని చాలవఱ కుపయోగించి, కార్యసాఫల్యత వడసినవా రగుటచే ఆది యుగసంస్కర్తలకును వీరికిని కొంచెము భేద మున్నది.

ఆంగ్లేయప్రభుత్వము మన దేశమునందు స్థిరపడినదాదిగ సంఘసంస్కరణచరిత్ర యందు నవీనయుగము ప్రారంభ మైనది. మన మిప్పు డాయుగమునందే యున్నాము.

ఈయుగధర్మములకును గడచినరెండుయుగధర్మములకును పెక్కుభేదము లున్నవి. ఒకరిద్దరుమహాపురుషులచే మాత్రము పక్రమింపఁబడక, దేశమునందు సమస్తభాగముల యందలిఅనేకవిద్యావంతులచే ప్రారంభింపఁబడి అభివృద్ధికి తేఁబడుచున్నది. దీనిని యొక్కఫల మింకకొంతకాలమునకు గాని స్పష్టపడఁజాలదు. ఒకరిద్దరుమాత్రమే పూని పనిజేసిన అది సర్వజనాదరణీయమగుటయందును దేశమున స్థిరముగ నాటుకొనుట యందును కొంచెముసందేహ ముండవచ్చును. ఇప్పు డట్లు గాక యిది అనేకులచే నుద్ధరింపఁబడుచున్నది. ఇది యిప్పుడు గాకపోయినను కొలఁదికాలముననే జనసమ్మతము కాఁగలదు. ఇది గాక ఇంకొకభేదముకూడ నున్నది. ఇప్పటిసంస్కర్తలు పూర్వపు సంస్కర్తలకన్న సంఘమునం దెక్కువలోపములను, వీనిని పోగొట్టుట కెక్కువమార్గము లను, వీనిస్థానమునం దుంచ నెక్కువయుత్తమమైనసదాచారములను గన్పెట్టఁగలిగి యున్నారు. దీనికి కారణము లేకపోలేదు. ఇప్పటిసంస్కర్తలయొక్కజ్ఞానమును అను భవమును కార్యోత్సాహమును పూర్వసంస్కర్తలజ్ఞానానుభవములకంటె అధికమై యున్నది. స్వదేశసంఘస్వచరిత్రజ్ఞానమునే పూర్వులు కలిగియుండిరి. నవీనులజ్ఞాన మింతకంటె నధికముగ నున్నది. ప్రపంచమునం దితరదేశస్థులతోడి సాంగత్యము, వారిసాంఘికరాజకీయపారిశ్రామికాచారపరీక్ష, వారిఆదర్శములయొక్కయు సద్గ్రంథ ములయొక్కయుపఠన, మొదలగుకారణములవలన వివిధములయినట్టియు విశేషమైనట్టియు జ్ఞానముల నిప్పటిసంస్కర్తలు కలిగియున్నారు. మనదేశమునందలి యాచారములును, మనప్రస్తుతపుస్థితియును మనకు చక్కగా తెలిసియున్నది. ఇతరదేశములయందలిప్రజ లెట్టియాచారములఁ గలిగియున్నారు? వారిసంఘాభివృద్ధికి హేతువు లెవ్వి? ఎంతవఱకు మనక్షీణత యీయాచారములులేమిచే కలిగినది? దేశాంతరాచారములు మన కెంతవఱకు తగినవి? అనువిషయములగురించి ఆలోచించి మనము చక్కగ తెలిసికొనఁ గోరు చున్నాము. ఇట్టియాలోచనను జేయుటకు పూర్వసంస్కర్తల కెట్టియవకాశమును లేదాయె. కనుకనే కార్యమును నెఱవేర్చుటయందు మన కెక్కువవివేక మున్న దని నిస్సందేహముగఁ జెప్పవచ్చును.

ఇంతే కాదు. పూర్వయుగములవారు బహుప్రాచీనములయినవైదికాచారము లను శాస్త్రనిబంధనలను దేశమునందు వ్యాపింపఁజేయుటయే సంస్కరణ మనిరి. శ్రుతిపురాణములయందు వర్ణింపఁబడినసంఘ మొక్కటిమాత్రమే యుత్తమమైన దనియుఁ దదితరము లట్టివి కా వనియు వారు దృఢముగ నమ్మిరి. ఆకారణముచేతనే యీశాస్త్రనిబంధనావలంబనమువలన సంఘములోనిసర్వలోపములును నశింపఁగల వని

వారుద్దేశించిరి. కనుక శాస్త్రపురాణముల ననుసరించుటయే వారిసంస్కరణధర్మము. మనసంస్కర్తలయుద్దేశములును పద్ధతులును అట్టివి కావు. సంస్కర్త చేయవలసినది సంఘోద్ధారణ గాని శాస్త్రోద్ధారణము మాత్రమే కాదు. శాస్త్రములయందు వర్ణింపఁబడినసంఘ మాశాస్త్రములు వ్రాయఁబడినకాలమునకు మాత్రమే యుత్తమమైనది. కాని సర్వకాలసర్వావస్థల కుత్తమమైన దని గ్రహించుట కెట్టివీలును గనపడదు. జన్మమెత్తుట యొకశాస్త్రప్రకార మనుష్ఠించుటకు మాత్రమే కాదు. తనకు సౌఖ్యమును గలుగఁజేసికొని, తన్ను తరింపఁజేసికొనుటకు గనుక శాస్త్రములలోని నియమములు తనకు సౌఖ్యము నీయఁగలవా? వానిలోగూడ లోపము లుండుట లేదా? కాలము మారుచున్నది. కాలమున కనుగుణముగ మనజీవితమందును అనేకమార్పులు గలుగుచున్నవి. ఎన్నియోవందలసంవత్సరములనాఁడు వ్రాయఁబడినశాస్త్రము లిప్పటిజీవితమున కనుగుణ్యమై యుండఁగలవా? ఏప్రకారముగ ఆకాలపుజను లాశాస్త్రములకు బద్ధులైయుండిరో, ఈకాలమున కనుకూలమైనశాస్త్రములను నిర్ధారణచేసికొని వీనికి బద్ధుఁడనై నేనును సౌఖ్యమనుభవింతును! ఇదియే యిప్పటిసంస్కర్తలవాదము. వీరియుద్దేశము పూర్వశాస్త్రములపునరుద్ధారణము కాదు; నవీనకాలమున కనుగుణమైనశాస్త్రములఁ గల్పించుకొనుటయే.

పూర్వసంస్కర్తకన్న నిట్టిభిన్నాభిప్రాయముల గలిగియున్న యీనవీనసంస్కర్తలు గడచినయేబదియాఱువదిసంవత్సరములనుండి చేయఁగలిగినపని యేదియో కొంచెము లోచింతము. దీనివలన వీరియుద్యమ మెంతవఱకు సఫలమైనదో స్థిరపడఁగలదు. వీరిదివఱకు జేసినపనులలో ప్రధానముయినదియు, మహోపకారముగ నెన్నదగినట్టియు కార్యము వీరు ప్రజలకు జేసినసంస్కరణసంబంధమైనబోధయే. సంఘసంస్కరణ మనునది సంఘమునకంతకు సంబంధించినది గాని ఒకరిద్దరికి మాత్రము సంబంధించినదికాదు. కనుక సంఘమునం జేనైన మార్పు లావశ్యకము లని తోచినపుడు సాంఘికుల అందఱి అంగీకారమును సాహాయ్యమును సాధ్యమైనంతవఱకు సంపాదించుట విధేయము. ఇది బోధనవలన కలుగవలసినకార్యము. సంస్కరణ కావశ్యకత యెద్దియో, దీనివలన నెట్టి ప్రయోజనములు రానున్నవో, ప్రజలకు దెలిపినగాని సంస్కరణము సులభము కాఁజాలదు. కనుక గ్రంథముల వ్రాసియుఁ బత్రికలఁ బ్రకటించియు, ఉపన్యాసములనిచ్చియు, సభలఁ గావించియు, వాదముల సల్పియు, సంస్కర్తలు ప్రజలకు సద్బోధజేసిరి. దీనివలన జనులమనస్సుల మార్చి తమయభిప్రాయములకు జనులయంగీకారమును బొందిరా యని యడుగవచ్చును. ప్రజలందఱు సంస్కరణమున కొప్పుకొనకపోయినను, సంఘము

నందు కొన్నియుత్పాతము లున్న వని మాత్రము వారు గ్రహింపఁగలిగి రని చెప్పవచ్చును. సంస్కర్తలు జేసినయీకార్యములవలననే దేశమునం దంతయు ఒక విప్లవము వ్యాపించుచున్న దని మనము దృఢముగ నమ్మవచ్చును.

దృఢమైనఅభిప్రాయముల కలిగియుండనట్టియు, ఆలోచనాశక్తిలేనట్టియు, ప్రజలమనస్సుల మార్చుట యొక్కటి. తమతో వాదించుప్రతిపక్షమువారిఅంగీకారము బొందుట మఱియొకటి. అయినను పట్టుదలతో పనిచేయుచుండువారగుటచే ఈసంస్కర్తలు పూర్వాచారపరాయణు లగు నీప్రతిపక్షమువారినిగూడ మేలుకొల్పి వారిసమ్మతమునుగూడ కొంతవఱకు బొందఁగలిగిరి. సంఘమునం దనేకులు పైఁ జెప్పఁబడినబోధలవలన సంస్కరణము ప్రయోజనకర మని నమ్మినను, ప్రప్రథమమున పూర్వాచారపరాయణులలో ననేకులవాదముల ఖండించి వీనియం దెట్టిసత్యమును లే దని వితర్కించుచుండిరి. ఇప్పుడు వీరిస్థితియం దంతయో మార్పు కలిగినది. సంస్కర్తలవాదములలో ననేకములు సహేతుకము లనియు వానిప్రకార మాచరించిన సంఘ మభివృద్ధి బొందఁగల దనియు, వీ రిప్పు డంగీకరించుచున్నారు. అయినను, ఉపయోగకరములయిన యీమార్పుల నభ్యాసమునం దుంచుటకుపూర్వము ఇవి శాస్త్రసమ్మతములా కావా యని వీ రాలోచింపఁదలచి, కంచి, కుంభకోణము మొదలగుప్రదేశములయందు పరిషత్తుల గావించుచున్నారు. ఉపయోగకరము లని తెలిసినతరువాత శాస్త్రసమ్మతములా కావా యని వాదించుటకంటె వివేకహీనత మఱియొకటి యున్నదా? ఏది యెట్లున్నను, సంస్కరణ మనవసరమైన దనియు, దానివలన దేశోపద్రవము కలుగు ననియు, ఒకప్పుడు వాదించుచున్నవారినిగూడ సంస్కర్తలు కొంతవఱకు వశపఱచుకొనఁ గలిగిరి. వీరు చేసినపనులలో నిది రెండవది.

మాటలవలన నొకరికి బోధించుటయు, ఇంకొకరిని వశపరచుకొనుటయు, అంత కష్టమైనకార్యము కాదు. మనబోధలప్రకారము మన మాచరించుటయు, ఇతరుల నాచరింపఁజేయుటయు సంస్కర్తలప్రధానోద్దేశముగ నుండవలయు. ఇట్టియాచరణ మేమైన నిప్పటిసంస్కర్తలు చేసిరా యని విచారించితిమేని కొంతవఱ కీవిషయమునందును వీరు సఫలీకృతులైరని చెప్పవచ్చును. సంఘమునందు వర్ణభేదము లుండఁగూడ దనుటయే సంస్కర్తలప్రధానబోధలలో నొక్కటై యున్నది. వర్ణభేదములో, తరగతిభేదములో లేనిదేశము ప్రపంచమునం దొక్కటికూడ లేదు గాని, మనదేశమునం దీవర్ణముల కుండు భిన్నత్వత మఱియేదేశమందును లేదు. వర్ణభేదము లుండుటమాత్రముచేతనే యేదేశమునకును కీడు కలుగఁజాలదు. స్త్రీలు పురుషు లనుభేద ముండుటవలన ప్రపంచమున

కేదైన హాని సంభవించెనా? పురుషుఁడు స్త్రీకన్న నెక్కువ యనెడిదురభిప్రాయముచే సంఘ మె ట్లభివృద్ధిగాకయుండునో, వర్ణములలో కొన్ని యగ్రవర్ణము లనియుఁ గొన్ని అధమవర్ణము లనియు, చేయఁబడువివక్షతచేతనే సంఘమున కపాయము కలుగుచున్నది. ఇంకొకవిశేషముకూడ కలదు. ఈవివక్షత గుణమునుబట్టి నిర్ణయింపఁబడెనేని న్యాయ విరుద్ధ మని చెప్ప నెవరును సాహసింపరు. అట్లు గాక మనదేశమునం దిది జన్మముచే నిర్ణయింపఁబడుచున్నది. దీనివలననే సంఘమున కుపద్రవము వృద్ధియగుచున్నది. వీని నన్నిటినిగుఱించి చక్కగ నాలోచించియే యీభేదములఁ బోగొట్టుటకు సంస్కర్తలు ప్రయత్నము జేసిరి. మానవులందఱు సోదరు లనియు, జన్మముచేతనే యొకఁ డధముఁ డగుటయు, మఱియొకఁ డుత్తముఁ డగుటయు లే దనియు, అన్నివర్ణములవారు సమానముగ గణింపఁబడవలె ననియు, వీరు బోధించిరి. మనసంఘమునం దిప్పుడు కూడ బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు పంచములు ననెడి భేద ముండినను, ఈ బోధలవలన ఈవర్ణములవారందఱు సమాను లనియే యిప్పు డెంచఁబడుచున్నారు. సభలయందును సమాజములయందును, అన్నివర్ణములవా రొక్కటిగఁ జేరి, సంఘీభావముతోడను, సమాను లనెడియభిప్రాయముతోడను పనిచేయఁగలిగియున్నారు. ఇదియే కదా మానవునిస్వగౌరవ మభివృద్ధియగుటకు మార్గము !

ఆచరణపూర్వకముగ సంస్కర్తలు నెఱవేర్చినపనులలో నింకొకటి నిమ్నజాత్యుద్ధరణయే. దేశమునం దిపుడు దాదాపుగ ఆఱుకోట్లనిమ్నజాతులవా రున్నారు. వారినే మనము సామాన్యముగ పంచము లని పిలుచుచున్నాము. వారివలె అంతహీనస్థితిని బొందినవారు ప్రపంచమునందు మఱియెవరును లే రని చెప్పవచ్చును. మనగృహములయందు కుక్కలు పిల్లులు మొదలగువానిని పెంచి ఆదరించుచుందుము కాని మనుష్యశరీరమును ధరించి, యితరులవలె వివేకాదుల గలిగియున్న యీనిమ్నజాతులవారిని స్పృశించుటగూడ యొకపాప మని మన మనుకొనుచున్నాము. వీరినీచస్థితికి కారణము బ్రాహ్మణులా శూద్రులా యని విచారించుట అనవసరము. ప్రధానవిషయము వీరు విద్యాగంధము లేకయు, ఆరోగ్య మన్న నేమియో యెఱుఁగకయు, స్వగౌరవహీనులై అధోగతిపాలయినా రనుటయే. ఇట్టిదుస్థితియం దున్నపంచములు సంస్కర్తలప్రయత్నముల వలన అగ్రవర్ణములవారిచే హిందువు లని అంగీకరింపఁబడిరి. ఇప్పుడు వీరిఅభివృద్ధికై యెల్లవారివలనను అనేకసదుపాయములు కావింపఁబడుచున్నవి. ధనము నిచ్చి కొందఱును విద్యాదానము జేసి కొందఱును, కాయకష్టమున కోర్చి మఱికొందఱును, వీరియభివృద్ధికై యెల్లప్రదేశములయందు పాటుబడుచున్నారు.

ఇది గాక సంస్కర్తలయుద్యమములవలన సముద్రయానము, దేశాంతరగమనము సర్వసాధారణమైనవి. రెండువేలహిందూవిద్యార్థులు దేశాంతరములయందు విద్యాభ్యాసముజేయుచుండుటయే దీనికి నిదర్శనము. స్త్రీవిద్య యభివృద్ధిఁజెందదొడగె. తుదకు స్త్రీవిద్య కూడ దని చెప్ప సాహసించువారెవరును కానవచ్చుటలేదు. సంస్కర్తల పట్టుదలచే దొరతనమువారు పునర్వివాహము శాస్త్రసమ్మత మని యంగీకరింప ననేకులు పునర్వివాహమాడి సుఖసంతుష్టులై యున్నారు.

పైఁజెప్పఁబడినవిషయములనుండి సంస్కర్తలు చేసినకార్యము బహుస్వల్పమనియుఁ జేయవలసినది యిఁక నెంతయో యున్నదనియు, స్పష్టమగుచున్నది. అఱువది సంవత్సరములనుండి పట్టుదలతో పనిజేసియు, పొందినఫలము మిగులస్వల్పమగుటవలన సంస్కర్త లనేకు లధైర్యపడి, సాహసముతో పనిచేయుట కూడ మానుచున్నారు. ఇది యెంతయో శోచనీయము. అయినను యిట్లధైర్యపడుటవలన ప్రయోజనము లేకపోవుటయే గాక అది అనవసర మనియు జెప్పవచ్చును. హిందూదేశమున సంస్కర్తల కుండుకష్టములు మఱియేదేశపుసంస్కర్తలకును లేవు. సంస్కరణ మన మార్పే గదా! సామాన్యముగ ప్రతిమనుష్యుఁడు మార్పున కిష్టపడఁడు. దినమంతయు జీవనోపాయమునకై కష్టపడి పనిజేసి, రాత్రి యింటికి వచ్చినతరువాత విశ్రాంతిబొంద ప్రతివాఁడు నిచ్ఛగించును కాని, సంఘ మెట్లున్నది, దానియం దేమార్పు లొనర్చిన బాగుగ నుండును, అని యాలోచించువా రనేకు లుండరు. ఒక్కొకమానవునకును వ్యాయామము లెన్నియో యుండును. వీని నన్నిటిని వదలుకొని సంస్కరణమునకై ప్రయత్నించువా రెవరో కొందఱు మాత్రమే. ఇది సర్వదేశములకును సమస్తసంఘములకును సహజమైన యంశమే. ఇఁక మనహిందూదేశమున్ననో, దీనియందు పూర్వాచారపరాయణత్వ మెక్కువ. మార్పు లన్న మనవారు భయపడుస్వభావము గలిగినవారు. పూర్వులు చేసినపనులును, వారియాచారములును ఉత్తమము లయిన వని సర్వదా యెంచుచుండెడివారు. న్యాయమునకన్న ఆచారమునే యెక్కువగ గౌరవించుచుందురు. కాలము మాఱినపుడు కాలానుగుణముగ తమజీవితములయందును మార్పు కలుగజేసికొనవలయు నసెడిజ్ఞాన మనేకులకు లేదు.

ఉన్నదానితోనే తృప్తిబొందియుండుటయు ఎన్నికష్టములు వచ్చినను వానిని తొలగింపఁ బ్రయత్నించక వానికి వశులగుటయు, దూరదృష్టి గాని లాభాపేక్ష గాని లేకయుండుటయు, మనవారికి సహజమై యున్నది. ప్రజలతత్వ మిట్టి దగుటవలననే, ఒక సంఘసంస్కరణమునందే గాక రాజకీయపారిశ్రామికవిషయములయందును మనవా రభి

వృద్ధిగాంచలేకయున్నారు. ఇట్టిదేశమందును, ఇట్టిజనులమధ్యను సంఘసంస్కరణ మంతవేగముగ అభివృద్ధియగుట లేదన్న నొకవింత కాదు. కనుకనే సంస్కర్తలధైర్య పడక, జనులస్వభావముల దెలిసికొని, ఓపికతో కార్యమును నెఱవేర్ప ప్రయత్నము జేయవలయును.

ఇంతే కాదు. మనదేశమందువలె గాక యితరదేశములయందు సంస్కర్తలు తమకార్యమును నెఱవేర్చుకొనుటయందు దొరతనమువారిసహాయమును విశేషముగ బొంద గలిగియున్నారు. ఇంగ్లాండు, జర్మని, ఫ్రాన్సు, జపాను మున్నగుదేశములయందు గడచినయేబదిసంవత్సరములనుండి సాంఘికసంబంధములయినశాసనము లెన్నియో నిర్మింపఁ బడినవి. ప్రభుత్వమువారు శాసించిరేని దాని నుల్లంఘించుట ప్రజలకు దుస్తరము గదా? మనదేశమునందే మైసూరు మొదలగుస్వదేశసంస్థానములయం దతిబాల్యవివాహ ములు కూడ వని శాసింపఁబడినది కదా? మనదొరతనమువా రన్ననో సాంఘికవిషయము లయం దట్టిశ్రోక్యమును కలిగించుకొనుట కిష్టపడకయున్నారు. ఈయయిష్టము కూడ సంస్కరణ మభివృద్ధికాకపోవుట కొకకారణ మని చెప్పవచ్చును.

దొరతనమువా రేల యిట్టిచట్టముల శాసించుటను సమ్మతింపకయున్నారు? దొర తనమువారికి దేశక్షేమమునందు శ్రద్ధలేకపోవుటవలన కాదు; ఇట్టిశాసనముల లన ప్రజ లకు లాభము కలుగు నని తెలియకపోవుటవలన కాదు. దీని కింకొకప్రబలకారణ మున్నది. ఇతరదేశములనవలె గాక మనదేశమునందు సాంఘికాచారములకును మతాచా రములకును పరస్పరసంబంధము మిక్కిలియధికముగ నున్నది. ఇంతే గాక సాంఘికా చారములపరిత్యాగము నడచుకొనుటయే మత మని మనవారిచే గణింపఁబడుచున్నది. సత్య మైనమత మిది యని తెలియకపోవుటచే మనవారనేకులు సాంఘికాచారములయందు మా ర్పావశ్యక మని నమ్మియు, ఆమార్పు గావించిన తమమతము చెడి తమకు నరకము ప్రాప్తించు ననెడిభయము గలవారైయున్నారు. మనధర్మశాస్త్రము లొకమతధర్మము లను మాత్రము విధింపక రాజకీయసాంఘికధర్మములను కూడ తెలుపుచున్నవి. ఈవివిధ ధర్మము లన్నియు నొకశ్రే శాస్త్రమునం దుండుటవలన నిది సాంఘికాచార మనియు, ఇది రాజకీయాచార మనియు విభజింప శక్తిలేకయున్నారు. మనువు బ్రాహ్మణుల కొకవిధమైనదండనయు శూద్రుల కింకొకవిధమైనదండనయు ప్రభువు విధింపవలయు నని పలుకుచుండ, ఆంగ్లేయప్రభువు లిప్పు డందఱకు నొకవిధమైనదండనను విధించు చున్నవారు కారా? మనపూర్వాచారపరాయణులవాదముప్రకార మిది మతవిరుద్ధమే. అట్లే మనశాస్త్రములు అనేకవిధములయినవివాహముల నంగీకరించుచున్నవి. వాని

నన్నిటిని యిప్పటిప్రభుత్వమువా రంగీకరించుటలేదు. ఇదియు మనవారివాదముప్రకారము మతవిరుద్ధమే. ఇట్లు ఆలోచించి చూచితిమేని ప్రతిఆచారము మతాచార మని తోచును. కాని యిది యొకగొప్పతప్పు. ఏలన, మనుశాస్త్రవిధులయం దిట్టిమార్పుల గావించి, వీనిప్రకారము నడచుకొనుచుండువారలు మతహీనులా? దైవభక్తి, పరోపకారము ప్రాణికోటియందు సోదరభావము, ఇవియే మతధర్మములు కనుక సంఘసంబంధమైనఆచారములకును మతాచారములకు విశేషభేద మున్నది. మనవారు దీనిని తెలిసికొనక సాంఘికాచారములప్రకారము నడచుకొనుటయే మత మనిరి. దొరతనమువా రిదివఱకే మతవిషయములయందు తా మెట్టిప్రవేశమును గలుగఁ జేసికొన మని చెప్పియున్నారు కాన సంఘమునందు దురాచారము లున్నను వానిని ఖూన్పింప నిష్టపడకయున్నారు.

సాంఘికుల పూర్వాచారపరాయణత్వము, దొరతనమువారి నిష్పక్షపాతబుద్ధి (Neutrality) ఈరెండును సంస్కరణ మభివృద్ధి గాకయుండుటకు ప్రబలకారణములు. ఇవి గాక మఱియొకకారణము గూడ నున్నది. అది విద్యావంతులలో ననేకులయుపేక్షయే (Indifference) సామాన్యప్రజలు పూర్వాచారపరాయణు లన్న నొకవింత కాదు. దొరతనమువారు పరదేశస్థులు కాన నేపక్షము నవలంబించుట కిష్టపడకయుండుట సహజమే. విద్యావంతులు మాత్ర మిట్టియుపేక్షత గలిగియుండుటకుఁ గారణ మగుపడుటలేదు. మనదేశమునందు పాఠశాల లనేకములు స్థాపింపఁబడినవి. పట్టపరీక్షల నిచ్చి బిరుదావళుల సంపాదించినవా రనేకు లున్నారు. విద్యావంతుల యొక్కజ్ఞానవివేకములు హెచ్చినవి. అయినను సంఘసంస్కరణవిషయమై వారి కిట్టియుపేక్ష యేల యుండవలయునో తెలియరాకయున్నది. అనేకులు బాల్యవివాహము లనర్థదాయకము లని యెంచియు దమయభిప్రాయముల బ్రకటింప ధైర్యము లేకయున్నారు. మఱికొంద ఱట్లు చెప్పియు దమయభిప్రాయానుసారముగ ఆచరింప మన స్థైర్యము లేకయున్నారు. కనుక మన మిప్పుడు ముఖ్యముగ గమనింపవలసినవిషయ మేమి యన ప్రతివిద్యావంతుఁడును తాను సంస్కర్త (Reformer) అనుపేరు పెట్టుకొనినను పెట్టుకొనకపోయినను, తనకు సాధ్యమైనంతవఱకు సంఘములోనిదురాచారముల బ్రకటించుచు, అట్టిదురాచారముల నశింపఁజేయుటకై ప్రయత్నించవలయును. ప్రజలు మూఢులై వివేకశూన్యులై యుండ, విద్యావంతులు మూర్ఖులవలె నుపేక్షజేసి యూరక యుండుటకంటె దేశక్షీణతకు హేతువు వే ఱొకటి యున్నదా?

సాంఘికబలమును వృద్ధిపరచుటకై సంస్కర్తలు పాటుపడుచున్నా రనుట కీపై రెండువిషయములు నిదర్శనములై యున్నవి. స్వాతంత్ర్య మున్న గాని సంఘ మభివృద్ధి కాదని సంస్కర్తలు వాదించుట కొకయుదాహరణము నిచ్చి ఈవిషయచర్చ నింతటితో విరమింతము. సముద్రయానమువలన దేశమున కనేకలాభములు కలుగు నని యెల్లరు నొప్పుకొనవలసినదే. వ్యాపారమునకై సముద్రయానము చేయువారు, విద్య నభ్యసించుటకై యీకార్యము చేయువారును, వైదికమతము నితరదేశములయందు వ్యాపింపఁజేయుటకై వెళ్ళువారును, ఏదియో యొకవిధముగ దేశమునకు మేలును జేయుచున్నారు. ఇంతటిమేలు చేయుచున్నవారిని సంఘమునుండి బహిష్కరించుటకంటె ధర్మవిరుద్ధ మే మున్నది? ఒకవేళ దేశాంతరమునం దుండునపుడు వీరు వైదికకర్మ లాచరించలేదు గాన వీరిని శిక్షించుట ధర్మ మని అంటి రేని, దేశాంతరమునకు వెళ్ళక సంఘమునందే యుండి కర్మల విడనాడి దుష్కృత్యముల గావించుచున్నవారిని మనము శిక్షింప గలిగియున్నామా? వీరికి లేనిశిక్ష వారి కేల యుండవలయును? ఇది గాక యెవనికర్మ వాని దనియు, స్వకర్మవలనిఫలము తానె గాని యితరు లనుభవించ రనియు మనము దృఢముగ నమ్ముచుండ, తనలాభముకొఱకె గాక దేశక్షేమముకొఱకై పాటుపడుచుండు వీ రేమైన తప్పు గావించి రేని దానివలనిఫలము వారు తప్పక బొందుదురుకదా? వారి స్వాతంత్ర్యమును నశింపఁజేయుటకు మన మేల ప్రయత్నింపవలయును? వారిస్వాతంత్ర్యతవలన సంఘమునందలియితరుల కేమైన కష్టనష్టములు కలిగె నేని వారిని బహిష్కరించుట దూషించుట బాగుగ నుండు నే గాని యెల్లరికి లాభము కలుగజేయుచుండువారిని ట్లనాదరించుట ధర్మమా? గనుక స్వాతంత్ర్య మిచ్చుటవలన దేశమునకు లాభమే కాని నష్ట మెన్నటికిని గలుగదు.

సంఘసంస్కరణోద్దేశములలో నెద్దానినిగుఱించి యాలోచించినను, దేశమునకు లాభకరము లైన వని స్పష్టముకాకమానదు. ఈయుద్యమము మనదేశమందు వేగముగ నభివృద్ధి గాకయుండుటకు కారణముల నిదివఱకె చెప్పియుంటిమి. ఒకవిషయము మాత్రము మనము ముఖ్యముగ గమనించవలయును. దేశమునందు నీతిశాస్త్రజ్ఞులును పండితులును సద్గ్రంథములును బయలువెడలినంతమాత్రముననే దేశ మెన్నటికి బాగుపడఁజాలదు. నీతిశాస్త్రములు లేమిచే మాత్ర మే దేశము క్షీణించలేదు? నీతి యిది

యనియు, ధర్మ మిది యనియు, తెలిసినప్పటికిని, వీనిప్రకారముగ నడుచుకొనక వీనికి విరుద్ధముగ ప్రవర్తించుటచేతనే సంఘములు నశించినవి. గనుక ధర్మప్రవర్తన యన నిది, దానివలన కలుగులాభము లిట్టివి అని తెలిసికొనుటకన్న, ధర్మప్రవర్తనయం దుత్సాహమును సంపాదించుట ప్రతివానికిని ప్రధానమై యున్నది. గ్రంథములయం దనేక ధర్మములగురించి యెల్లరు చదువువారలే. వానిప్రకార మాచరించువారు మట్టు కెందఱున్నవారు? గనుక ఉత్సాహము, ధైర్యము, సాహసము, మనసంఘమునం దిప్పుడావశ్యకములై యున్నవి.

సంస్కరణసభల గావించి, అనేకవిషయములగురించి తీర్మానముల జేయువారలలో కొందరైన కార్యోత్సాహము గలవారై తమమాటలప్రకార మాచరించుచుండవలయు. ఇతరులు తమతో కలసినను కలియకపోయినను తాము ధర్మాచరణము గావించుచున్నయెడల ఇప్పుడు గాకపోయినను కొంతకాలమునకైన సంస్కరణ మభివృద్ధి జెందఁగలదు. కార్యోత్సాహము గలిగి దేశాభివృద్ధికై సంస్కర్తలు సంఘీభావముతో పనిచేయుదురు గాక అని నమ్ముచు నింతటితో విరమించుచున్నాను.

దాయమునందు మరలఁ బ్రవేశించి, తదభివృద్ధినిమిత్తమై పాటుపడవలసినట్లీశ్వరాదేశము నతఁడు గ్రహించెను. అందువలనఁ దనమనమున కెంతయునిష్టముగా నున్నను దేవేంద్రనాథుఁడు తిరిగి కలకత్తానగరమునకు రావలసివచ్చెను. ఆతనియాగమనఫలితముగా నిరుపమానమైనకార్యోత్సాహము మరల బ్రాహ్మసమాజమునందుఁ బ్రభవించెను. ఈతరుణమునం దాతఁ డొసంగినప్రసంగములు యువజనులహృదయప్రదేశములయం దభినవోత్సాహాగ్నిని బ్రజ్వలింపఁజేసెను. అప్పటికే దేవేంద్రనాథుఁడు లేనికాలమునందు కేశవచంద్రసేనుఁడు బ్రాహ్మసమాజమునందుఁ బ్రవేశించెను. కేశవచంద్రదేవేంద్రనాథులకు వెంటనే మైత్రి కలిగెను. కేశవచంద్రసేనులు మహర్షియం దపరిమితములైనప్రేమగౌరవములఁ బ్రకటించెను. సద్వంశసంజాతుఁడై, మేధాసంపన్నుఁడై సమాజమునందుఁ బ్రవేశించిన యీకేశవచంద్రుని మహర్షి యనురాగపురస్సరముగా నభినందించి పుత్రవాత్సల్యమును జూపెను. ఏకమనస్కులై వీరిరువురును గొంతకాలమువఱకు సమాజాభివృద్ధికై శ్రమజేసిరి. ఈయుభయులపరిశ్రమమునవలనఁ గాలీఘట్టమునందే గాక వంగదేశమునం దెల్ల నొకనవీనచైతన్య మావిర్భవించెను. వందలకొలఁది యువజనులు బ్రాహ్మసమాజమునందు బ్రవేశింపఁదొడంగిరి. నూతనముగాఁ జేరినయీయువజనులు మతప్రచారమునందు విశేషశ్రద్ధ వహించి నగరనగరములకు నరిగి క్రొత్తసమాజములఁ స్థాపింప మొదలుపెట్టిరి. 1864 సంవత్సరమునందుఁ గేశవచంద్రసేనులు చెన్నపురికిని బొంబాయిపురమునకును బోయి, యాయానగరములందలి జనులహృదయములలో బ్రాహ్మమతాభిరతి నుదయింపఁజేసెను. కేశవచంద్రసేనుని యుపన్యాసములమూలముననే 1867 సంవత్సరమున బొంబాయినగరమునందలి ప్రార్థనసమాజమును, చెన్నపట్టణమునందలి వేదసమాజమును బ్రతిష్ఠింపఁబడెను. ఈవేదసమాజము బహువిధములయినమార్పులను బొంది యిప్పుడు దక్షిణహిందూదేశబ్రాహ్మసమాజ మను పేరునఁ బరగుచున్నది.

బ్రాహ్మసమాజముయొక్క సిద్ధాంతవిషయమునందును ననుష్ఠానవిషయమునందును నీకాలమునం దధికమైనయభివృద్ధి కలిగెను. ప్రతిమపూజను విసర్జించినను, బ్రాహ్మసమాజికులలోఁ బలువురు కులభేదములను బరిత్యజింపరైరి. వివాహశ్రాద్ధాదికర్మలయందు విగ్రహారాధనము ననేకులు సలుపుచునే యుండిరి. ప్రతిమారాధనముతో నెట్టిసంబంధమును గల్గియుండుటయు నయోగ్యమును నక్రమమును నని కేశవచంద్రసేనులు మొదలయినయువజనులయొక్క దృఢాభిప్రాయము. విగ్రహారాధనమును, వర్ణభేదమును

పూర్తిగా విసర్జించుటకు నెల్లరు నొక్కటిగాఁ గృతసంకల్పులయిరి. పూర్వాచారానుసారముగా హిందూకర్మలప్రకారము తనతండ్రియొక్క శ్రాద్ధమును జేట్టక నిరాకరించి నిజబంధువర్గమునందును, గలకత్తాసంఘమునందును నొకసంక్షోభమును 1846 సంవత్సరమునందే కలిగించి, మహర్షియే యీకర్మవిషయికసంస్కారమునందు మార్గదర్శకుఁ డయ్యెను. కాని తరువాతఁ జాలకాలమువఱకు నతనిత్రోవ ననుసరించువా రెవ్వరును బయలుదేఱరైరి. కేశవచంద్రసేనులును, నతనిమిత్రబృందమును దేవేంద్రనాథుఁడు నడచినమార్గమున నడచి యాతని కెంతయు నాహ్లాదమును బ్రోత్సాహమును గూర్చిరి. యువజనుల నూతనాకాంక్షలతో మహర్షియు నేకీభవించెను. యజ్ఞోపవీతమును గూడ నతఁడే త్యజించెను. బ్రాహ్మవివాహవిధానము ననుసరించి దేవేంద్రనాథుఁడు తనకుమారితలలో నొక్కరితయొక్క వివాహమును జరపి యీనవీనవివాహకర్మావలంబనమునందును మార్గము జూపినవాఁ డయ్యెను.

మఱికొంతకాలము బ్రాహ్మసమాజము నిరంతరాయముగా నభివృద్ధినొందెను. అంతర్వ్యాపారములయందే గాక జనులలో వ్యాపనవిషయమునందు గూడ బ్రాహ్మసమాజము ముందడుగు వేయుచుండెను. కాని కొలఁదికాలములో దేవేంద్రనాథకేశవచంద్రులకు నభిప్రాయభేదములు వొడమెను. యజ్ఞోపవీతధారు లయినసామాజికు లాచార్యపీఠమును వహించుటగుఱించి మొట్టమొదట వారిద్దఱకును భేదభావ మంకురించెను. విగ్రహారాధనముయొక్కయు వర్ణభేదముయొక్కయుఁ జిన్నెలుగా నెన్నఁదగినజన్నిదములను దాల్చినవా రాచార్యులుగా నుండఁదగ రని కేశచంద్రునియొక్క యుద్దేశము. చాలకాలముక్రిందటనే సమాజమునందుఁ జేరినవారై యుపన్యాసాదికముల సలుపుచు, తదభివృద్ధికై పలుభంగుల పనిసేయుచున్నవృద్ధాచార్యులయెడ గాఠిన్యమును బూన మహర్షికి నెంతమాత్రము నిష్టములేదయ్యెను. అపుడు సమాజమునందు రెండుపక్షము లేర్పడెను. సహజముగా వృద్ధులందఱు మహర్షిపక్షమును, యౌవను లెల్లరు కేశవచంద్రసేనునిపక్షము నవలంబించిరి. ఈయిరుతెగలవారిలో నొకరు సాంప్రదాయమును సంరక్షించువారుగను, మఱియొక రభివృద్ధిని గోరువారుగను నేర్పడిరి. మొట్టమొదట దేవేంద్రనాథుఁడు యువజనులయుద్దేశముల నభిమానించి యజ్ఞోపవీతధారులగువృద్ధుల నాచార్యపదవినుండి తొలఁగించి, యజ్ఞోపవీతమును విసర్జించినయువజనులను దత్పదవియందు నియోగించెను.

ఇట్టిసమయమునందు కేశవచంద్రసేనునిపక్షమునం దొకవివాహము తటస్థించెను. ఈపరిణయమాడిన వధూవరులు భిన్నవర్ణములకుఁ జెందినవారు. కులభేదమును బాటింపక చేయఁబడినయీయుద్వాహము దేవేంద్రనాథుని భయకంపితునిఁజేసెను. వెంటనే యతఁడెదుటిపక్షమువారికి నెఱిఁగింపకయే పూర్వపుటాచార్యులను యథాస్థానములయందు నియమించెను. కేశవచంద్రప్రభృతు లాతనిచర్య యక్రమం బని వాదించిరి గాని కార్యము లేదయ్యె. సమాజధర్మకర్తలలో మిగిలినవాఁడు తా నొక్కఁడే యగుటచే యువజనులకుఁ దా నొసంగినయధికారములనెల్ల నూడఁదీసి, తత్వబోధినీపత్రికను వారియాజమాన్యమునుండి తొలఁగించెను. కేశవచంద్రసేనునిపక్షమువారు ప్రతినిధిసభయొకటి యేర్పాటుచేసి, సామాజికకార్యములయందుఁ దాముగూడ నధికార మందుకొని యైకమత్యము నెట్టులయిన నిలుపఁబెట్టఁ గొంతకాలము ప్రయత్నించిరి. ఈయత్నము సాగమిచే భరతవర్ష బ్రాహ్మసమాజ మను నామమున 1866 సంవత్సరము నవంబరుమాసమునందు వారొకప్రత్యేకసమాజమును స్థాపించిరి. యౌవనులలో ననేకు లీనూతనసమాజమునందుఁ బ్రవేశించి యభినవబలోత్సాహములతో తత్వృద్ధికై కృషిచేసిరి. పూర్వసాంప్రదాయముల నిలుపఁ బ్రయత్నించెడు నావృద్ధులయొక్క బెడఁద తీఱుటచే భరతవర్షీయబ్రాహ్మసమాజికులు తమసంఘమునం దావశ్యకములగు నెల్లసంస్కారములను గావించి సమాజము నున్నతపదవికిఁ దేఁగడంగిరి. భరతవర్షీయబ్రాహ్మసమాజపుమతప్రచారకులు దేశమునందలినానాభాగములను దర్శింపఁదొడఁగిరి. బ్రాహ్మమతబోధకములగుపత్రికలను గ్రంథములను బ్రచురింప నారంభించిరి. కతిపయమిత్రసమేతుఁడై కేశవచంద్రసేనుఁడు నీసమయమునందే యింగ్లాండుదేశమునకు నరిగి తత్ప్రజలయాదరగౌరవములఁ బడసి, మహోపన్యాసములఁ జేసి బ్రాహ్మసమాజమునందు నాదేశాంతరమునఁగూడ నభిరుచి జనియింపఁజేసెను.

ఈభారతవర్షీయబ్రాహ్మసమాజస్థాపనముతోడ సామాజికధర్మములలోఁగూడఁ గొన్నిముఖ్యపరివర్తనములు చేయఁబడెను. మతాభిప్రాయము లెంతయుదారములుగా నున్నను, దేవేంద్రనాథునికాలమునందు బ్రాహ్మసమాజము హిందూసాంప్రదాయముల నతిక్రమింపలేదు. బ్రాహ్మమతమునకుఁ గొంతవఱకు సాధారణస్వభావము నొసంగినవాఁడు కేశవచంద్రుఁడే యని చెప్పవచ్చును. భారతవర్షీయబ్రాహ్మసమాజమునందుఁ గావింపఁబడినమార్పులలో నెల్ల నియ్యది మిగులఁ బ్రధానమైనది. సర్వమతగ్రంథముల

నుండియు, సకలమతములనుండియుఁ గూడ నిరాక్షేపముగా గ్రహింపఁదగినవిషయముల నెల్ల నతఁ డామోదించి స్వీకరింపసాగెను. ఉపనిషత్సారమంతయు బ్రాహ్మధర్మ మనుగ్రంథరూపమున నింతకుఁబూర్వమె రచింపఁబడినది. తమసర్వసమత్వము తేటపడు నట్లు సకలప్రమాణగ్రంథములనుండియు సద్వాక్యములఁ గైకొని యొకపుస్తకరూప మున భారతవర్షీయబ్రాహ్మసమాజికులు ప్రచురించిరి. ఇంతియే గాక సామాజికోపా సనయందు సంస్కృతమునకుఁ బ్రత్యామ్నాయముగా వంగభాష వాడఁదొడంగిరి. భాషా డంబరమును దగ్గించి స్వేచ్ఛానుసారముగా నుపాసించుటకై యెక్కువయవకాశ మియ్యఁ బడెను. సామాజికులప్రత్యేకజీవనమునందే గాక, సాంఘికోపాసనలయందును నధిక మైనయుత్సాహమును భక్త్యావేశమును గనఁబడఁజొచ్చెను. ప్రార్థనపశ్చాత్తాపములను గూర్చి సమాజమునందు గభీరాలోచనము లంకురించెను. ఇట్లు నవీనముగా సమాజ సముద్రమునందు నుప్పొంగఁదొడంగినభావతరంగముల కెల్ల కేశవచంద్రుఁడె మూలకార ణుఁడు. వర్ణభేదములను బాటింపక బ్రాహ్మసమాజమునందు జరగసాగినవివాహములు రాజశాసనసమ్మతములు గానయ్యెను. అందుచే భారతవర్షీయబ్రాహ్మసమాజికులు కేశవ చంద్రసేనునినాయకత్వమున నీవిషయమును బ్రభుత్వమువారికి నెఱిగించి తద్వివాహములు రాజశాసనాంగీకారము లగునట్లు 1872 సంవత్సరమున నొకశాసనమును బుట్టింపఁ జేసిరి. 1872 సంవత్సరపు ప్రత్యేకవివాహశాసన మని పిలువంబడు నీచట్టముప్రకారము పురుషులు 18 యేండ్లకుఁబూర్వము గాని, స్త్రీలు 14 యేండ్లకుఁబూర్వము గాని పెండ్లాడుటకు వలనుపడదు.

మఱికొంతకాలము సమాజ మెట్టియుఁ దొందరలు లేక సరళముగా సాగెను. కాని దినదినప్రవర్ధమాన మగు తనయనుగామిమండలియొక్క విశ్వాసమును కేశవచంద్రుఁ డును జిరకాలము నిలుపుకొనఁజాలఁడయ్యెను. కేశవచంద్రుఁ డవలంబింప నారంభించిన నిరంకుశపద్ధతులను నొప్పుకొననినవీనపక్ష మొకటి భారతవర్షీయబ్రాహ్మసమాజమునందు నుదయించెను. సామాజికకార్యపరిపాలనమును బ్రతినిధిసంఘముల మూలమున జరుప వలయు ననియు, సాంఘికవిషయములందు ముఖ్యముగా స్త్రీలవిషయమునందు నెక్కువ సంస్కారము లావశ్యకము లనియు నీనూతనపక్షమువారియాశయము. పరులకుఁ బై కంతయు నిశ్చలముగనే కాన్పించుచుండినను, కేశవచంద్రసేనునియొక్కయు, తదను చరులయొక్కయుఁ బద్ధతులనుగుఱించి యొకవిధమైనయసంతుష్టాగ్ని సమాజాభ్యంతర మున రవులుచుండెను.

సందిగ్ధమైనయీసమయమునందె బ్రాహ్మసమాజచరిత్రమునందు మఱియొకగొప్ప మార్పును గలిగింపనున్న యొకకార్యము జరిగెను. కేశవచంద్రసేనుఁడు తనప్రథమ పుత్త్రికను కూచిబిహారురాజుగారియొక్క పుత్త్రున కిచ్చి వివాహము సేయఁదలంచినట్లు 1878 సంవత్సరమునందుఁ దెలియవచ్చెను. ఈవార్త బ్రాహ్మసంఘము నాశ్చర్యము పాలుచేసెను. వివాహకాలమునకు వరునకు 18 సంవత్సరములును, వధువునకు 14 సంవత్సరములును, నుండవలయు నని కేశవచంద్రసేనునిచే నిర్ణయింపఁబడి సామాజికు లందఱిచే నామోదింపఁబడెను. తా నేర్పఱచిననియమమును కేశవచంద్రసేనుఁడే యుల్లంఘింప సిద్ధపడెను. ఇతనిపుత్త్రికకుఁ బదునాలుగేండ్లు గాని కుచిబీహారురాజకుమారునకుఁ బదునెనిమిదేండ్లు గాని లేవయ్యెను. వరుఁడు బ్రాహ్మసమాజికుఁడు కాఁడు. మీఁదు మిక్కిలి కుచిబిహారురాజకుటుంబముయొక్క హిందూవివాహవిధానప్రకారము విగ్రహారాధనసమేతముగా నావివాహము గావింపఁబడు నని యొకవదంతి పుట్టెను. అంతట నీవివాహమునుగూర్చి యనేకప్రదేశములందలిబ్రాహ్మసమాజములును, ప్రత్యేకసామాజికులును, దమతమయాక్షేపణములను కేశవచంద్రసేనునికి నెఱిఁగించిరి. నాయకుఁడును నాచార్యుఁడు నయినకేశవచంద్రుఁడే యిట్లు బ్రాహ్మసమాజవిధుల నతిక్రమించినపుడు నుద్యమమున కంతకు నపఖ్యాతియు నాశమును గల్గుట నిశ్చయం బని యెల్లసామాజికులును భయపడిరి. ఆక్షేపణములను లక్ష్యముసేయక వివాహమును జరగించుటకు కేశవచంద్రుఁడే స్వయముగాఁ గుచిబిహారునగరమునకు నరిగెను. బ్రాహ్మవివాహమున కావశ్యము లగు ననేకాంశములు తద్వివాహవిధానమునందు లోపించె ననియు, నింకను విశేషాక్షేపణీయము లగు బహులక్షణము లందుఁ గల వనియు ననంతర మెల్లవారికిఁ దెలిసెను.

కేశవచంద్రసేనుఁడు కూచిబిహారునుండి తిరిగివచ్చినతరువాత, నాకూచిబీహారు వివాహము నామోదింపనివారందఱు భారతవర్షీయబ్రాహ్మసమాజసభ యొకటి గావించి యందుఁ దమయనిష్టమును బ్రకటింపఁ బ్రయత్నించిరి. కాని సమాజకార్యదర్శి యగు కేశవచంద్రసేనుఁ డనేకప్రతిబంధకములఁ గల్పించి యాసభ జరుగకుండఁజేసెను. అయినను నాతనిని నాచార్యపీఠమునుండి తొలగించుచు నొకతీర్మానమును మాత్రము వారు చేయఁగలిగిరి. కాని సమాజనిబంధనముల నణుమాత్రము పాటింపక కేశవచంద్రసేనుఁ డారక్షకభటులసాయమువలనఁ దనయాచార్యస్థానమును బలవంతముగా నిలుపుకొనెను.

ఆయాక్షేపకు లంబులును కేశవచంద్రసేనునివిపరీతవర్తనమునకు విసుగుఁ జెంది కలసిమెలసి యెప్పటికొప్పునఁ గార్యము సాగించునుపాయము గానక సాధారణ బ్రాహ్మసమాజముగా నేర్పడి, తత్సమాజకార్యము లన్నిటిని నిర్ణీతనిబంధనానుసారముగా నడపఁ గృతసంకల్పులైరి.

కలకత్తాపురమందిరమునందు 1878 సంవత్సరము మే నెలలో బహిరంగముగా జరిగిన యొకమహాసభలో నీసాధారణబ్రాహ్మసమాజము విధ్యుక్తముగా స్థాపింపఁబడెను. ఇతరస్థలములందలియనేకసమాజము లీనూతనసమాజముతోఁ జేరెను. సమాజమునందుఁ బ్రబలుఁడుగా నుండఁ దటస్థించు నేపురుషుఁడు గాని సర్వాధికారమును దానే వహించి మిగిలినసామాజికులమనోరథమునకు వ్యతిరేకముగా వర్తించి యింతకుఁ బూర్వమువలెనె యిఁకముందును సమాజమునందు విభాగములను గల్పించుటకు వీలు లేకుండునట్లు కట్టుదిట్టములు సేయుట తమముఖ్యకార్యముగా నెంచి తద్విషయికనిబంధనముల నేర్పఱచుట కీనూతనసామాజికులు ప్రప్రథమముననే పూనుకొనిరి. ఈనూతనసమాజనిర్మాణమునందుఁ బ్రతినిధ్యనియమము సంపూర్ణముగాఁ బాటింపఁబడెను. సమాజమునందలిప్రతిసభ్యునినుండియు ననుమతిపత్రికను బుచ్చుకొని యేటేటఁ గార్యనిర్వాహక సంఘము నేర్పాటుచేయునట్లు నిశ్చయింపఁబడెను. కలకత్తాసమాజమునకే గాక యితర ప్రదేశములందలి సమాజములకుఁగూడఁ దత్సభకుఁ బ్రతినిధులను బంపునధికార మియ్యఁబడెను. ఆస్తికమతజ్ఞానము భారతవర్షమునం దంతటను వ్యాపించుట కీనూతనసమాజమే ముఖ్యమార్గ మయ్యెను. 1880 సంవత్సరమున నీసమాజముకొఱకయి విశాలమై సుందరమైనయొకమందిరము కలకత్తానగరముయొక్క మధ్యభాగమునందు నిర్మింపఁబడెను. కేశవచంద్రసేనులును నాతనిపక్షావలంబకు లగుసామాజికులును ద్విగుణితమైన పట్టుదలతోఁ గృషిసేయ మొదలుపెట్టిరి. పూర్వపుసంయుక్తసమాజముయొక్క ద్రవ్యాదిరూపమైనసాధనసంపత్తి యంతయు వారియధీనమునం దుండుటచే నూతనసామాజికులకంటెఁ బనిసేయుటకు వారి కెక్కువయవకాశ ముండెను. కేశవచంద్రసేనునియందు నధికబద్ధానురాగు లైన వృద్ధులగుధర్మోపదేశకు లందఱు నాతనిపక్షముననే నిలిచిరి. ఆత్యంతవిశ్వాసమును దనయెడలఁ బూనియుండిన యాబోధకమండలియొక్క తోడ్పాటుమూలమున నతఁడు బ్రాహ్మధర్మమును నానాభాగములందు వ్యాపింపఁజేయఁగలిగెను. సామాన్య జనులకు నగోచరములుగా నుండున నేకనూతనమతాభ్యాసములను దనసమాజమునం దతఁడు

ప్రవేశపెట్టెను 1880 వత్సరమున కేశవచంద్రుఁడు తనసమాజమునకు నవవిధానసమాజ మని నూతననామకరణము చేసి నిజబోధకమండలియందలిపన్నిద్దఱకు నవవిధానప్రవక్తలని పేరుపెట్టెను. అసదృశచారిత్రుఁ డగునీమహానుభావుఁ డాకస్మికముగా నకాలమృత్యువువాతఁబడియెను. అనేకవత్సరంబులు విశ్రాంతి యెఱుఁగక పరిశ్రమచేయుట వలనను బహుసమాజములును సమాజికులును దననుండి విడిపడుటచేతను తన్నంటియుండిన ధర్మోపదేశకులలో నంతఃకలహములు గల్గుటవలనను, నాతఁడు పొందినమనోవ్యథయె మొదల నారోగ్యభంగమునకుఁ గారణభూత మయ్యెను. తుదకు నతఁడు 1884వ సంవత్సరమునఁ బరమపదమునొందెను. అతనిమరణానంతరమున నవవిధానసమాజము మతింత తాఱుమాఱయ్యెను. ఏకభావము లేక ప్రవక్తలును, బోధకులును దమలోఁ దాము కలహింపసాగిరి. ధర్మోపదేశకులందఱు నొక్కటిగాఁ గూడి పనిచేయకపోయినను విడివిడిగా నుండియు వా రధికమైనశ్రద్ధతోడను స్వార్థత్యాగబుద్ధితోడను సమాజాభివృద్ధికై పాటుపడిరి.

సాధారణబ్రాహ్మసమాజము ప్రతిష్ఠింపఁబడినపిమ్మట మతప్రచారవిషయమున బ్రాహ్మసమాజమునందు మరల నవ్యకార్యోత్సాహ మంకురించెను. దేశమునందు మరల ననేకనూతనసమాజములు స్థాపింపఁబడెను. అక్కడక్కడ నుండినపూర్వసమాజములతో దృఢమయినసంబంధ మేర్పఱుచుటకుఁ బ్రయత్నములు సేయఁబడెను. సాధారణబ్రాహ్మసమాజ మిట్లు దినదినాభివృద్ధినొందెను. ఇప్పటికిని గలకత్తాలో శ్రద్ధతో సంఘమతసంస్కారములకై కృషిసేయుచున్నయనేకనవీనసంఘములు తత్సమాజికులచే నెలకొల్పఁబడినవే. సాధారణబ్రాహ్మసమాజ మిప్పుడు స్థిరముగా నేర్పడిన దని చెప్పవచ్చును. బ్రాహ్మసమాజ మారంభమయినతరువాత మొట్టమొదటి 30 సంవత్సరములలో రెండు పర్యాయము లంతఃకలహములచే విభాగములు తటస్థించెను. కాని సాధారణబ్రాహ్మసమాజము స్థాపింపఁబడి యిప్పటికి 30 సంవత్సరములు గడచినను నట్టితొందర లేమియు లేక నానాఁట నభివృద్ధిఁ జెందుచున్నది. నిరంతరాభివృద్ధియే ముఖ్యోద్దేశముగాఁ గలిగి తద్వృద్ధి కత్యంతావశ్యకమగుస్వాతంత్ర్యము నెల్లరకు సంపూర్ణముగా నొసంగునట్టి బ్రాహ్మసమాజమునందు నభిప్రాయభేవము లుండుట స్వాభావికమే గాని యాశ్చర్యకరము గాదు. అట్టియభిప్రాయభేదములును సాధారణబ్రాహ్మసమామునం దనేకములు గలవు. అయినను సభ్యులస్వల్పభావభేదములచే సమాజాభ్యుదయమునకు భంగము

గలుగకుండఁ దత్పరిపాలనావిషయమునందు దగినకట్టుదిట్టములు చేయఁబడినవి. ముఖ్యవిషయములలో నైకమత్యమును, నముఖ్యవిషయములలో భిన్నత్వమును నెల్లవిషయములందును నౌదార్యమును నుండవలె ననునుత్తమధర్మసూత్రము ననుసరించి, విశాలమై యుదాత్తమైనసమదృష్టితోఁ బ్రతినిధులమూలముగా సామాజికకార్యముల నిర్వహించెడునుత్కృష్టపద్ధతి యవలంబింపఁబడినది. ఇవ్విధమున సద్ధర్మములప్రకారము సమాజము పరిపాలింపఁబడుటచేతనే తమలోఁ దాము కొన్నిధర్మములనుగుఱించి యెట్టిభిన్నాభిప్రాయములఁ గల్గియున్నను సమాజమునందలి స్త్రీపురుషులెల్లరు నొక్కటిగాఁ బనిసేయుచు నీశ్వరమహిమాతిశయమును ప్రపంచమునకుఁ బ్రకటించుచు మానవసేవను సలుపఁగలుగుచున్నారు.

# బ్రాహ్మసమాజసంగ్రహచరిత్రము.

అతిప్రాచీనకాలమునుండి యిప్పటివఱకును హిందూమతమును సంస్కరించుటకై యనేకప్రయత్నములు జరిగినట్లు తన్మతచారిత్రపరిశీలనము లన నుబోధకము కాఁగలదు. దాదాపుగాఁ బ్రతియుగమునందును నానాకాలములయందు జనులచే నవలంబింపఁబడు మతమునందలి లోపములను రూపుమాపుటకయి సంస్కర్తలు కృషిసలిపియున్నారు. ఇట్లు సంఘమునందు బయలుదేఱినప్రతిసంస్కారోద్యమమును బ్రజలహృదయసీమలయందు సత్యస్వరూపుఁ డగుపరబ్రహ్మము యొక్క యాధ్యాత్మికోపాసనను నెలకొల్పుటనే ప్రధానోద్దేశము గాఁ గలిగియుండెను. ఉపనిషత్కాలపుఋషీశ్వరుల నాఁటినుండి నేటివఱకును దరతరమునందును మనభరతఖండమునందలి యేదియో యొకభాగమునందు నెవ్వరో యొకమహాపురుషుఁ డుద్భవించి భక్తిరాహిత్యము చేతను, కర్మకాలత్వము చేతను విగ్రహారాధనము చేతను జెడిపోవుచుండ హిందూమతమును సంరక్షించియున్నాఁడు. హిందూమతమునుగూర్చి క్రమమైనచరిత్ర లేమిచే నామహాసంస్కర్తల నామములు అన్నియు మనకుఁ దెలియవయ్యెను. అయినను నాసంస్కారసంతతిలోఁ జేరినమహానుభావు లగు గౌతమబుద్ధుఁడు, నానకు, కబీరు, తుకారాము, చైతన్యులయొక్క పవిత్రనామముల నిటఁ బేర్కొనినఁ జాలును. ధన్యచారిత్రు లగు నాపురుషవరేణ్యులచే నత్యంతసామర్థ్యముతో సాగింపఁబడినయమ్మహాప్రయత్నము నేఁ డ్వర్తమానభరతవర్షమునందు బ్రాహ్మసమాజము నలుపుచున్నది. తత్సంస్థాపకుఁ డగు రాజా రామమోహనరాయలువారును హిందూస్థానమునకు నిరుపమానప్రఖ్యాతిని దెచ్చిన యాఋషిసత్తములయొక్కయు భక్తాగ్రేసరులయొక్కయు సరియైన సంతతివాఁడనుటకు సంశయము లేదు.

భరతఖండమునం దిప్పు డొకనూతనయుగ మారంభమయినది. హిందూదేశచరిత్రమునం దీయుగమున కద్వితీయమైనప్రాముఖ్యము గలదు. ప్రకృతమునందువలె మునుపెన్నడును మనజాతీయజీవనమునందలి సకలశాఖలలోను నిట్టి శీఘ్రములైనమార్పులు జరిగియుండలేదు. భారతజాతియొక్క రాజకీయసాంఘికపరిశ్రమికాదిసర్వవిషయములందును నిప్పు డొకమహత్తరమైనపరివర్తనము కలుగుచున్నది. ఇంత యేల? సకలప్రపంచము

వకును మనోహరముగా నుండు నద్భుతనాటకరాజ మొకటి హిందూదేశరంగప్రదేశమునందుఁ బ్రదర్శింపఁబడుచున్నది. దూరదూరముగాఁ జాలకాలమునుండి ప్రవహించుచుండినమహావాహినులం బోలుప్రాగ్దేశపాశ్చాత్యనాగరికతలు రెండును మనహిందూదేశమునందుఁ గలిసికొనినవి. ఈయుభయనాగరికతలసమ్మేళనమువలన భావిమానవకోటిచే ననుసరణీయం బగు నొక శ్రేష్ఠమై, సంపూర్ణమైనయుత్తమనాగరికత యుదయింపనున్నది. నిత్యుఁడై, నిరాకారుఁడై, నిఖిలప్రజాపితరుఁడైన యేకేశ్వరునియుపాసననే ప్రధానముగాఁ గలిగినట్టియు,జాతివర్ణాదిభేదము లేక సమస్తదేశస్థులను సమస్తవర్ణస్థులను సమ్మేళనము చేయ సమర్థమైనట్టియు నొకసాధారణమతాదర్శమును బ్రాహ్మసమాజప్రతిష్ఠాపకుఁడగు రామమోహనరాయలవారికి దయామయుఁడగుభగవంతుఁ డుపదేశించియుండెను.

లోకమునందలియెల్లముఖ్యమతస్థులచే నాత్మాభివృద్ధినిమిత్తమై యనుసరింపఁబడు నానావిధసాధనవిధానములను నెఱిఁగినవాఁ డగుటచే నుదారమై విశ్వజనీన మైన యీమహామతమును బ్రకటించుటకై రామమోహనుఁడు భగవంతునిచే నుద్దేశింపఁబడెనేమో యనుతలం పెల్లవారికినిఁ గలుగకమానదు. ఒకయుత్తమహిందూకుటుంబమునందుఁ బుట్టి పెరిగినవాఁ డగుటచే, రామమోహనుఁడు హిందూమతసంబంధము లైన నిఖిలగ్రంథములను సకలాధ్యాత్మికసాధనకలాపములను జక్కఁగా నెఱిఁగియుండెను. విశేషవయస్సు రాకమునుపే యాతఁడు మహమ్మదీయమతము గుఱించినగ్రంథసముదాయమును జదివెను. భాషాంతరములమూలమునఁ గాక మూలమునందే బైబిలు వేదగ్రంథమును జదువ నెంచి హీబ్రూగ్రీకుభాషలను బఠించి, తద్గ్రంథమును శ్రద్ధతోఁ బరిశీలించి, క్రైస్తవమతమునుగూర్చి యథార్థజ్ఞానమును సంపాదించెను. ఉదారములైన తనమతాభిప్రాయకారణముచే గృహమునుండి తండ్రిచే వెడలనడపఁబడినవాఁడై యుత్తరహిందూస్థానమునందుఁ గొంతకాలము సంచరించి, హిమాలయపర్వతమున కావల నున్నటిబెటుదేశమున కరిగి, బౌద్ధమతజ్ఞానమును బడసెను. నానాప్రదేశములయందుఁ జరించి, షోడశభాషల నేర్చి, హిందూమహమ్మదీయాదిపంచమహామతములయొక్క ప్రమాణగ్రంథముల శోధించి సర్వమతసారముగాఁ దా గ్రహించినమతరాజమును భరతఖండమునందే గాక యావత్ప్రపంచమునందును వ్యాపింపఁజేయ నెంచి యాతఁడు తననలుబదవయేట 1814 వ సంవత్సరమునఁ గలకత్తానగరమునఁ బ్రవేశించి స్థిరనివాస మేర్పఱచుకొనెను. ఈమహాత్మకార్య

సాఫల్యార్థమై యామహనీయుఁడు తనయావద్భాగ్యమును, యావత్కాలమును, యావచ్ఛక్తిని వినియోగించెను.

మృదుమధురసంభాషణములద్వారమునఁ దనస్నేహితకోటికిని, లిఖితోపన్యాసములమూలమున మానవకోటికిని దనసందేశము నెఱిఁగించుచు నామహాపురుషుఁడు పదునాల్గుసంవత్సరములు తనయుద్యమమును ఫలింపఁజేయుటకై పాటుపడెను. హిందువులేమి క్రైస్తవు లేమి సామాన్యజను లెవ్వరును నాధీమంతునియంతరంగమును గ్రహింపలేక తీవ్రముగా నతనిని నిందింపసాగిరి. ఆయామతావలంబులప్రమాణగ్రంథములందలి వాక్యములనే చూపి హిందువులను క్రైస్తవులను వాదములలో నిరుత్తరులను జేయుటకై యతఁడు ప్రయత్నించెను.

నిరాకారుఁడై, నిత్యుఁడైన యేకేశ్వరునియుపాసననే హిందూప్రాచీనప్రమాణగ్రంథములు విధించుచున్న వని తనహిందూప్రతిపక్షుల కాతఁడు ప్రమాణవాక్యములఁ గనఁబఱచెను. ఈశ్వరపితృత్వము, మానవభ్రాతృత్వము ముఖ్యముగాఁ గలపరిశుద్ధాస్తిక మతమునే జీసను బోధించె నని క్రైస్తవుల కతఁడు స్పష్టముగాఁ దెలియఁజేసెను. "దేవుఁ డొక్కఁడు, మానవకోటి యొక్కటి" యనెడునుత్తమధర్మము నుపదేశించెడు సాధారణాస్తికమతమును స్థాపించునిమిత్తమై యతఁ డిట్లు పూర్వాచారపరాయణులగు హిందూక్రైస్తవమతస్థులతో ననన్యసహాయుఁడై పోరాడవలసినవాఁడయ్యెను. తుట్టతుదకు రామమోహనుఁడు జాతిమతవివక్షత లేకుండ నెల్లవారును నేకముగా నుపాసించు నుద్దేశముతో నొకసమాజము నేర్పఱిచి తన్నిమిత్తమై కలకత్తానగరమున నుత్తరభాగమున నొకగృహము నద్దెకుఁ దీసికొనెను. పిదప రెండుసంవత్సరముల కతఁడు కొందఱుమిత్రుల సాహాయ్యముతో బ్రాహ్మసమాజమునకు కలకత్తాపురముయొక్కమధ్యభాగమునం దొకసామాన్యమందిరమును నిర్మించెను. అది యిప్పటికిని ఆదిబ్రాహ్మసమాజ మను పేరం బరగుచున్నది.

జాతిమతాదిభేదము లేక కొంద ఱీసదనమునందు వారవారమును నేకేశ్వరోపాసననిమిత్తమై చేరుచుండిరి. ఉపనిషత్తులనుండి కొన్నిశ్లోకములను జదువుటయుఁ, గొన్ని కీర్తనలను బాడుటయు, రామమోహనవిరచితములగు మతోపన్యాసములను బఠించుటయు నప్పటియీశ్వరోపాసనయై యుండెను. బహిరంగముగా నిట్టియుపాసనలను జరుపుటకుఁ బూర్వము కొంతకాలము సామాజికులందఱు మందిరమునకు వెనుకభాగమున నున్న

మొకగదిలోఁ గూర్చి వేదాధ్యయనము చేయుచుండిరి. వేదపఠనమునకు బ్రాహ్మణులకు మాత్రమే యధికార ముండుటచే నాయుపాసనకు బ్రాహ్మణేతరులు పోవుటకు వీలు లేకుండెను.

శైశవావస్థలో నుండిన యీమతసమాజమును రామచంద్రవిద్యావాగీశున కొప్పగించి 1830 వ సంవత్సరము ఆగష్టు నెలలో రామమోహనుఁ డింగ్లాండు దేశమునకుం బయనమయ్యెను. దేశాభిమానధురంధరుఁడును బహూపకారపారీణుఁడునై ప్రసిద్ధిఁజెందిన యీమహనీయుఁ డా దేశమునందు 1833 వ సంవత్సరము సెప్టెంబరు 27 వ తేదీని పరమపదము నొందెను. తన్ను స్థాపించి, పోషించుచుండిన రామమోహనుఁడు కలకత్తానగరమును వదలినదాదిగా బ్రాహ్మసమాజము క్రమక్రమముగా నాశిల్లఁదొడంగెను. రామమోహనునియందలి గౌరవాతిశయముచే నందుఁ బ్రవేశించిన యనేకసామాజికులుఁ డింగ్లాండుదేశమునకుఁ జనినప్పటినుండియు సమాజమునుగుఱించి చింతింప మానిరి. కాని పరమవిశ్వాసి యగు నారామచంద్రవిద్యావాగీశుఁ డొక్కరుఁడు మాత్రము సమాజమును త్యజియింపఁ డయ్యెను. గట్టిపట్టుదల గలవాఁడయి యేడేండ్లపాటు నతఁడు కాలము గడచుచుండ దినదినము నామందిరమున కరిగి, రామమోహనుఁ డుపదేశించినవిధమున నుపాసనను నడపుచుండెను. భూశయనము చేయఁబడిన యవసానపశయ్యందు నయితము తనభర్తకు మరల ప్రాణములు చేకూరునేమో యని పేరాసతో నతనిముఖమునే చూచుచు వేచియుండెడు భార్యపగిది, నావిద్యావాగీశుఁడు చేయివిడువక సమాజమును గని పెట్టుకొనియుండెను. ఒక్కొక్కప్పు డుపాసన వారిఁ డొంటరిగానే జరుపవలసినవాఁ డగుచుండెను. ఇటులుండ నతఁడు తా నెన్నఁడు నెదురుచూచి యెఱుఁగనిదిక్కునుండి యాకస్మికముగా సాయమును బొందెను. రామమోహనుని స్నేహితుఁడును సహాయుఁడు నైన ద్వారకానాథఠాకురుయొక్క ప్రథమపుత్రుఁడు 1838వ సంవత్సరమున బ్రాహ్మసమాజమును గూర్చి శ్రద్ధఁ దీసికొన నారంభించెను. తనబాల్యమునందు దేవేంద్రనాథుఁడు రామమోహనునిఁ జూచియుండెను. రామమోహనుఁడును నతనియం దెక్కుడుమక్కువ గనఁబఱచెను. తాఁ బూనినకార్యభారమును తనమరణానంతరము వహించుటకు దేవేంద్రనాథుఁడు సమర్థుఁడు గాఁగలఁ డని రామమోహనుఁ డప్పుడే తలంచినట్లు కొందఱు నుడువుదురు. కాని చాలకాలమువఱకు దేవేంద్రనాథునియం దేవిధమైనమతానురాగమును నంకురింపలేదు.

ధనవంతులగుపలువురుబిడ్డలవలె దేవేంద్రనాథుఁడును మొట్టమొదట మహావైభవముతో నిశ్చింతుఁడై వర్తించెను. కాని యకస్మాత్తుగా నొకదినమున నాతని డెందములో నొకమహత్తరమైనమార్పు పొడమెను. మరణ మాసన్నమై యున్నతనపితామహిని గంగాతీరమున నుంచి యామెశ్మశానవాటికయందుఁ గాచియున్నసమయమునం దతని కొకయసదృశమైన నూతనభావోదయము కలిగెను. అప్పు డాతఁడు దివ్యానందదర్శనమును బొంది యనిర్వాచ్యమైనపరమానందము ననుభవించెను. అంతట నతని కిహలోకైశ్వర్యము లెల్ల మిక్కిలిస్వల్పములుగాఁ దోఁచెను. నాటినుండియు నాతనిజీవితప్రవాహము మఱియొకనూతనమార్గమునఁ బోసాగెను. అనేకవాసరము లతఁడు తదేకధ్యానమునందుఁ గడపెను. దేవుఁ డద్వితీయుఁ డనియు, నింద్రియాగోచరుఁ డనియు ప్రతిమారాధన మెన్నటికిని భగవదారాధనము గానేరదనియు, నతఁడు గ్రహించెను. ఆసమయమున రామమోహనుఁ డతనిస్మరణమునకు వచ్చెను. బ్రాహ్మసమాజమును గుఱించి విచారింపఁజొచ్చెను. రామచంద్రవిద్యావాగీశులవారికి వర్తమానమంపెను. వెంటనే దేవేంద్రనాథుఁ డీపండితవరేణ్యునిచేత నుపనిషత్తుల నేర్వ నారంభించి, యాస్తికమతబోధకము లగుగ్రంథములపఠనమును వ్యాపింపఁజేయుఁ దలంపుతోఁ దత్త్వబోధినీసభ యనుపేర నొకసమాజమును స్థాపించెను.

ప్రప్రథమమున నీసమాజమునందు దేవేంద్రనాథుఁడు నాతనిసోదరాదిబంధువులె సభ్యులుగా నుండిరి గాని త్వరలో నది యన్యులను గూడ నాకర్షింపఁదొడంగెను. ఆసంఘమునకు విద్యావాగీశులవా రాచార్యులుగా నేమింపఁబడిరి. 1840 సంవత్సరమున నాసమాజముయొక్క ప్రథమవార్షికోత్సవము విశేషవైభవముతో జరుపఁబడెను. బ్రాహ్మసమాజము మిక్కిలిదీనదశయందుండినయిత్తఱిమునఁ దత్త్వబోధినీస్థాపన మెంతయు దానికిఁ బ్రోత్సాహదాయకమయ్యెను. తత్త్వబోధినీసభాసదు లీబ్రాహ్మసమాజమును వర్ధిల్లఁజేయ నెంచి తాము ప్రత్యేకముగా జరుపుకొనుచున్నయుపాసనను మానుకొని బ్రాహ్మసమాజోపాసనయందుఁ జేర నిశ్చయించుకొనిరి.

ఇట్లు యత్నవంతులయుత్సాహప్రోత్సాహములచే బ్రాహ్మసమాజము పునర్జీవమును బొందెను. తదాదిగా బ్రాహ్మసమాజమునఁగల నూతనకార్యోత్సాహ మంకురించెను. వృద్ధాచార్యుఁ డగు నావిద్యావాగీశునియొక్క పట్టుదల నేఁటికి ఫలించినది. విద్యావాగీశుఁడే శ్రద్ధతీసికొనియుండకపోయినచో రామమోహనునిచే నాటఁబడిన బ్రాహ్మసమాజబీజము మొలకెత్తక యంతరించియుండును.

ధీమంతుఁ డగు దేవేంద్రనాథుఁడు బ్రాహ్మసమాజాంకురమును దగినవిధమున దోహదముచేయఁ దొడంగెను. తనసామర్థ్యాతిశయముచే నతఁ డనేకయౌవనులను సమాజమునందుఁ జేర్చెను. నిరంతరపరిశ్రమపరాయణుఁ డగుటచే నతఁడు సమాజాభివృద్ధికై యనేకోపాయముల నరయ నారంభించెను.

దేవేంద్రనాథుఁడు సమాజమునందుఁ జేరకపూర్వము శ్రద్ధతో నుపాసనకొఱకు సమాజమునకు వచ్చువారిసంఖ్య మిక్కిలితక్కువగా నుండెను. కేవలవినోదమునిమిత్తము కొందఱును, వేదమంత్రపఠనము వినుకుతూహలమునఁ గొందఱును, భగవత్కీర్తనముల నాలకింపఁ గొందఱును, నిట్లు నానావిధములైనయుద్దేశములతో జనులు బ్రాహ్మసమాజోపాసనలకుఁ జనుచుండిరి. నిర్ణీతమైనయొకయుద్దేశము గాని నిశ్చితమైనయొకయభిప్రాయము గాని యందెవ్వరికిని లేదయ్యెను. వేదపఠనము నాకర్ణించుట కనర్హులైనట్టు లెంచి బ్రాహ్మణేతరులను దమసమాజమునందుఁ జేర్చుకొనక జాతిమతాదిభేదములు లేక యెల్లవారును సమాజోపాసనలయందుఁ జేరవచ్చు నని తత్సమాజప్రదానపత్రమునందుఁ జేయఁబడిననిబంధన ముల్లంఘింపఁబడెను. ప్రతిమారాధనమును, అవతారములను గూర్చిన సిద్ధాంతములు నిరాతంకముగా సామాజికవేదినుండి తఱచు బోధింపఁబడుచుండెను. సమాజమునందుఁ దాఁ బ్రవేశించినతోడనే దేవేంద్రనాథుఁ డీలోపములఁ దీర్పసమకట్టెను.

దేవేంద్రనాథునియొక్క ప్రాబల్యమువలనను, ప్రోత్సాహమువలనను, నాసమాజము సంపూర్ణముగాఁ బరిశుద్ధాస్తికమతసమాజ మయ్యెను. ఉపాసనకై యొందఱో తన్మందిరమునందు సమావేశమగుచుండినను, వారందఱ నైక్యముచేసెడుసమానధర్మము లెవ్వియు లేకుండెను. సకలేతరహిందువులవలెనె గృహమునందు నీసామాజికులును విగ్రహారాధకులుగనే యుండిరి. ఏకేశ్వరునియందు నమ్మక ముంచి, యాతని నొక్కనినే యాత్మపూర్వకముగను, యథార్థముగను, నుపాసించెడునొకసంఘమునుగా బ్రాహ్మసమాజమును జేయ నెంచి దేవేంద్రనాథుఁ డొకప్రతిజ్ఞాపత్రమును దయారుచేసెను.

విగ్రహారాధనావిసర్జనమును, వేదాంతానుసారముగా బ్రహ్మోపాసనయు, ప్రణ్యామస్థానమును బ్రతిసామాజికుఁడును బ్రతిపాలింపవలసిననియమములుగా నందుఁ జేర్కొనఁబడెను. 1843వ వత్సరము డిశెంబరుమాసమునందుఁ దానే మొట్టమొదట నాపత్రికను సంతకముచేసి తీసికొని విద్యావాగీశులవారిచే బ్రాహ్మసమాజమునందుఁ జేర్చుకొనఁబడినవాఁడై దేవేంద్రనాథుఁడు తత్ప్రతిజ్ఞాపత్రికాస్వీకారమునందు నితరసామాజికులకు

మార్గమును జూపెను. అతఁ డవలంబించినయీనూతనపద్ధతి బ్రాహ్మసమాజచరిత్రములో నత్యంతప్రధానమయినది. అతఁడు త్రొక్కినత్రోవ ననుసరించి యిరువదిమందిసామాజికులు సంతకములుచేసి ప్రతిజ్ఞలను గైకొనిరి. బ్రాహ్మసంఘములయొక్క బీజ మిట్లు హిందూస్థానక్షేత్రమునందు మొట్టమొదట నాటఁబడినది. 1847 సంవత్సరము వచ్చుసరికి బ్రాహ్మమతస్థులసంఖ్య యేఁడువందలయిరువదియేఁ డయ్యెను.

స్పష్టముగా నెవ్వరును జెప్పకపోయినను, బ్రాహ్మమత ముపనిషత్తుల నాధారము చేసికొనియుండిన ట్లింతవఱకు భావింపఁబడుచుండెను. తనక్రైస్తవప్రతికక్షులవాదములను బైబిలునందలిప్రమాణములమూలముననే ఖండింపఁగడంగినట్లు రామమోహనుఁడు తనహిందూప్రతిపక్షులతో వాదింపవలసివచ్చినపుడు హిందువులప్రమాణగ్రంథము లగు నుపనిషత్తులలో నుండి ప్రమాణవాక్యములను గనఁబఱచుచుండెను. హిందూమతస్థుల ప్రమాణగ్రంథము లెవ్వియు విగ్రహారాధనము నంగీకరింప వని స్వదేశస్థులకుఁ దెలుపు నిమిత్తమై యుపనిషత్తులఁ గొన్నిటి నాతఁడు సంస్కృతమునందుఁ బ్రచురించుటయే గాక ఆంగ్లవంగభాషలలోఁగూడ వానిని రచించి ప్రచురించి స్వదేశవాసులకే గాక పరదేశీయులకుఁ గూడ నందలిరహస్యము లెల్లఁ దేటతెల్లమగునట్లు చేసెను. ఇటులఁ జేయుంటచే బ్రాహ్మమతమున కుపనిషత్తు లాధారము లని రామమోహనునియనుగాములు తలంచిరి. తొలుత వేదాంతమే బ్రాహ్మమతముగా భావింపఁబడెను. మూకీభావ మర్ధాంగీకారముగాఁ బరిగణింపఁబడుటచే వేదములయొక్క ప్రామాణ్యత గూడ సమ్మతింపఁబడినట్లుగనే యెన్నఁబడెను. అందువలన బ్రాహ్మమతము నొకవేఱుమతముగా నెంచుటకు జనుల కంతగాఁ గారణము కనఁబడదయ్యెను. ఇత్తఱుణమునందు నుత్తమహిందూకుటుంబమునకుఁ జెందిన యొకబాలుఁడు క్రైస్తవమతమునందుఁ జేరఁ దటస్థించెను. అపుడు హిందూజనసంఘమునందుఁ గ్రైస్తవులయెడఁ గలిగినమహాద్వేషము బ్రాహ్మసమాజమునకుఁ గొంతప్రోత్సాహము నొసంగెను. తనబ్రాహ్మమతానురాగమునకు నుపనిషత్తులు మొట్టమొదట నంతఁగాఁ దోడ్పడినవి గాకపోయినను దేవేంద్రనాథుఁ డుపనిషత్తులయెడ నధికవిశ్వాసము గల్గియుండెను. అంతియే గాక సంహిత లాదిగాఁ గలయితర ప్రమాణగ్రంథములనెల్ల నిరాకరించినను, నుపనిషత్తులనుమాత్రము బ్రాహ్మమతమునకు నాధారములుగా నంగీకరింపవలె నని యతఁ డుద్దేశము కనఁబఱచెడువాఁడు. కాని యిక్కాలమునందు నాయుపనిషత్తులనుగూడ నమోఘప్రమాణములుగా సమ్మతింపని

యువజనులు కొందఱు సమాజమునందు బయలుదేరిరి. బ్రాహ్మసమాజమునం దీవిషయమై వాదప్రతివాదము లనేకసంవత్సరములు నడచెను. మహర్షి దేవేంద్రనాథుఁడు దీనిని గుఱించి జాగరూకతతో నాలోచించి చతుర్వేదములను బఠించుటకై నల్వురుపండితులను వారణాసికిఁ బంపెను. ప్రసిద్ధులగు వేదవిద్వాంసులతో నీమహద్విషయమునుగూర్చి చర్చించుటకై యాతఁడుగూడ స్వయముగాఁ గాశీపురమున కరిగెను. తుట్టతుద కీయాలోచనమంతయు నాతనిమనస్సున కనుకూలముగాఁ బరిణమింపలేదు. నిష్పాక్షికవిచారణమీఁద వేదములు గాని యుపనిషత్తులు గాని యమోఘప్రమాణములుగా నంగీకరింపఁదగనివిగాఁ దేలుటచేఁ దన కంతయునిష్టముగాను, విచారకరముగాను నున్నను నతఁడు 1848 సంవత్సరమున గ్రంథప్రమాణమును ద్యజింపవలసినవాఁ డయ్యెను. ఇట్లు వేదాంతసంబంధమైనయేకేశ్వరసిద్ధాంతము మెల్లమెల్లగా స్వాభావికమైనసాధారణాస్తికమతముగా మారెను. తోడనే యాతఁ డుపనిషత్తులలోని యాస్తికమతబోధకములగు శ్లోకరాజముల నెల్ల నొకగ్రంథరూపముగఁ జేర్చి కూర్చెను. దేవేంద్రనాథుఁ డీగ్రంథమును తన జ్ఞాపకమునుబట్టి యక్షయకుమారదత్తునకుఁ జెప్పి వ్రాయించెను.

పూర్వోక్తములయినమార్పు లన్నియు 1850 సంవత్సరమున జరగినసాంవత్సరికమహోత్సవమునందు యథావిధిగాఁ బ్రకటింపఁబడెను. ఇప్పు డీయుత్సవము జనవరి 24వ తేదీకి సరియైన మాఘశుద్ధయేకాదశినాఁడు వంగదేశమునందు మిగులవైభవముతో సలుపఁబడుచున్నది. ఇప్పటికి 88 సంవత్సరములక్రిందట రామమోహనరాయలవారు యను కలకత్తానగరమునందలి చిత్పూరురోడ్డను భాగమునందు నిర్మించినట్టిప్రార్థనమందిరముయొక్క ప్రవేశోత్సవము నీదినమునందే జరగించెను. ఇట్లు పునర్నిర్మాణము గావింపఁబడినయీ సమాజము మతప్రచారమునిమిత్తమై యధికముగాఁ గృషిసేయ నారంభించెను. నానాప్రదేశముల కరిగి దేవేంద్రనాథుఁ డనేకనూతనసమాజముల నచ్చటచ్చట నెలకొల్పెను. ధర్మోపదేశకుల గొందఱను సిద్ధముచేసి వారిమూలమున వంగదేశమునందంతట బ్రాహ్మసమాజసందేశము ఎక్కుగా వెల్లడియగునట్లు చేసెను. పలుసంవత్సరములవఱ కీవిధమున నధికోత్సాహముతోఁ బనిసాగెను. గ్రంథపఠనమునందును, భగవద్ధ్యానమునందును, భక్తియోగమునందును గాలము గడపనెంచి మహర్షి హిమాలయపర్వతప్రాంతముల కరిగెను. నానావిధాందోళనములతో నిండియుండెడు జనమధ్యమునకుఁ బోవ నతఁడు మనస్కరింపఁ డయ్యెను. కాని పదునెనిమిదిమాసము లీతీరున నేకాంతమున గడపునప్పటికి జనసము